VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
రంగారెడ్డి, నల్గొండ : మంగళవారం 28.07.2026
సంపుటి : 09 సంచిక : 49 , పేజీలు : 12 , వెలరూ . 5/-
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH
www.velthuru.com



## మహంకాళి బోనాలకు శ్రీధర్‌బాబుకు ఆహ్వానం

# దేశంలోనే తెలంగాణ కాంగ్రెస్ నంబర్-1





- ఢిల్లీలో ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ సంస్థాగత వ్యవహారాలపై కీలక సమీక్ష
- కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ రెడ్డి సహా నేతల సమావేశం
- సంఘటన్ సృజన్ అభియాన్ అమలుపై ప్రశంసలు
- బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పనితీరుపై సంతృప్తి
- SIR పనుల్లో నిర్లక్ష్యానికి తావు ఉండొద్దని సూచన
- ఎల్లుండి టీపీసీసీ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం

## సింగరేణిని బీఆర్ఎస్ ప్రభుత్వం దెబ్బతీసింది: కిషన్ రెడ్డి

- దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని వ్యాఖ్య
- నాలుగు రాష్ట్రాలు, ఎన్‌టీపీసీకి సింగరేణి నుంచి బొగ్గు సరఫరా
- బీఆర్ఎస్ హయాంలో సంస్థకు తీవ్ర నష్టం జరిగిందని ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా పరిస్థితి మెరుగుపడలేదని విమర్శ
- సింగరేణిలో కేంద్రానికి 49%,



రాష్ట్రానికి 51% వాటా ఉందన్న కేంద్రమంత్రి
- రాజకీయాల కోసం సింగరేణిని వాడుకున్నారని కేసీఆర్‌పై మండిపాటు

## కేంద్ర హోంమంత్రి క్షమాపణ చెప్పాలి

- విద్యార్థులపై దాడి ఘటనపై స్పందించాలి
- కాంగ్రెస్ ఎంపీ చామల డిమాండ్
- విద్యార్థులపై దాడి ఘటనను ఖండించిన కాంగ్రెస్ ఎంపీ
- బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో వ్యవహారం ముగిసినట్లు కాదన్న చామల



- పార్లమెంట్ సమావేశాల నిర్వహణలో కేంద్రం బాధ్యతగా వ్యవహరించాలని సూచన

## విద్యార్థులపై పోలీసుల దాడులకు నిరసన





- పార్లమెంట్‌లో విపక్షాల ఆందోళన
- కాంగ్రెస్ నేతృత్వంలో విపక్షాల నిరసన
- విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండించిన ఎంపీలు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- జూలై 20 'సంసద్ మార్చ్' ఘటనపై ఆగ్రహం
- పార్లమెంట్‌లో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచిన ప్రతిపక్షం
- విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్

## ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టేందుకు ఆడబిడ్డలంతా నడుం బిగించాలి మంత్రి సీతక్క

- తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ఉద్యమంలా విజయవంతం చేద్దాం



హైదరాబాద్ వెలుతురు జూలై 27:

దేశవ్యాప్తంగా నెలకొన్న ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. ముఖ్యంగా తెలంగాణలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో ముందుండి పాల్గొని ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టేందుకు కృషి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించవచ్చని మంత్రి పేర్కొన్నారు. రానున్న తరాలకు నీటి భద్రత కల్పించాలంటే ఇప్పటి నుంచే ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం జల సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని అన్నారు.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమంగా విజయవంతం చేయాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. మహిళా సంఘాలు గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ నీటి సంరక్షణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు షాక్

- కమిషనర్ పోస్టు నుంచి తొలగించాలని సీఎస్‌కు ఆదేశం
- 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై తీవ్ర ఆగ్రహం
- కోర్టు ఆదేశాలను పదేపదే ఉల్లంఘించడం సరికాదన్న ధర్మాసనం
- రంగనాథ్ స్థానంలో కొత్త అధికారిని నియమించాలని సూచన



- తదుపరి విచారణకు రంగనాథ్ వ్యక్తిగత హాజరుకు ఆదేశం

హైదరాబాద్, వెలుతురు, జూలై 27:

హైడ్రా (HYDRAA) కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది.

## మహేశ్వరం తెలంగాణ మోడల్ స్కూల్ సందర్శించిన సీ.ఎస్ సంజయ్ జాజు



హైదరాబాద్, వెలుతురు, జూలై 27



మహేశ్వరంలోని తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నిదునాక్ష్మికంగా సందర్శించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు సోమవారం మహేశ్వరం మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌ను సందర్శించి పాఠశాలలో విద్యా బోధన, మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఆయన వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, పోటీ పరీక్షలకు సన్నద్ధత, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాల పెంపు వంటి అంశాలపై విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు.విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో ముందుకు సాగాలని ప్రధాన కార్యదర్శి సూచించారు.

## విద్యార్థులపై దాడులు ఆపాలి మోదీ క్షమాపణ చెప్పాలి: రాహుల్ గాంధీ

- విద్యార్థుల అణచివేతపై కేంద్రంపై రాహుల్ గాంధీ విమర్శలు
- ఏకే-47 కాల్పులు, లాఠీఛార్జీలపై తీవ్ర ఆగ్రహం
- విద్యార్థులపై కేసులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్న కాంగ్రెస్ ఎంపీ
- ఇచ్చిన హామీలను ప్రధాని మోదీ నిలబెట్టుకోలేదని ఆరోపణ
- దాడులకు బాధ్యులపై



కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ఎక్స్ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై విమర్శల వెల్లువ

## జార్జియా టెక్ సీటు సాధించిన విద్యార్థికి కోమటిరెడ్డి శుభాకాంక్షలు

హైదరాబాద్ వెలుతురు జూలై 27:

అమెరికాలోని ప్రముఖ జార్జియాటెక్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో గ్రాడ్యుయేషన్ సీటు సంపాదించిన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం పెద్ద సూరారం గ్రామానికి చెందిన యరమాద అశ్మిత్ సోమవారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని మ ర్యాద పూర ్వక ంగా కలిశారు.తన ప్రతిభతో ప్రముఖ జార్జియాటెక్ యూనివర్సిటీలో సీటు సంపాదించిన అశ్మిత్ ను మంత్రి అభినందించారు. నల్లగొండకే కాదు యావత్ తెలంగాణకు, దేశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చేలా కష్టపడి చదివి,ప్రయోజకుడు కావాలని ఆశీర్వదించారు.అశ్మిత్ తల్లి దండ్రులు యరమాద జగదీష్ రెడ్డి - శ్రీలత లకు శుభాకాంక్షలు తెలిపారు. అశ్మిత్ తండ్రి జగదీష్ రెడ్డి ఎవెర్జెంట్ టెక్నాలజిస్ అమెరికా హెడ్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తన తండ్రిని ఆదర్శంగా తీసుకుని ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని, అస్మిత్ కు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆల్ ది బెస్ట్ చెప్పారు.



# దేశంలోనే తెలంగాణ కాంగ్రెస్ నంబర్-1

**ఢిల్లీ వెలుతురు జూలై 27:**

ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాలపై కీలక సమావేశం జరిగింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కేసీ వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్ తదితరులు సమావేశమయ్యారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ సమావేశంలో తెలంగాణలో పార్టీ సంస్థాగత కార్యక్రమాలు, SSA (సంఘటన్ సృజన్ అభియాన్), SIR పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చేపట్టిన సంస్థాగత కార్యక్రమాల అమలుపై కేసీ వేణుగోపాల్ సంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమాల అమలును ఆయన అభినందించారు. SIR పనులను మరింత వేగవంతం చేయాలని, ఎలాంటి చిన్న నిర్లక్ష్యానికీ తావు ఇవ్వకుండా ప్రత్యేక శ్రద్ధతో పూర్తి చేయాలని నేతలకు సూచించినట్లు సమాచారం.సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ సంస్థాగత బలోపేతంపై కూడా విస్తృతంగా చర్చించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ చేపడుతున్న సంస్థాగత కార్యక్రమాల అమలులో తెలంగాణ రాష్ట్రం నంబర్-1 స్థానంలో నిలిచిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కోఆర్డినేటర్ (సంఘటన్ సృజన్ అభియాన్) గంప వేణుగోపాల్ వెల్లడించారు.ఇదిలా ఉండగా, ఎల్లుండి ఉదయం 10 గంటలకు ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో టీపీసీసీ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం జరగనుంది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత కార్యక్రమాలతో పాటు SIR పురోగతిపై మరోసారి సమీక్ష నిర్వహించనున్నారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు...

(మొదటి పేజీ తరువాయి)

ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తప్పించి, స్థానంలో మరో అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సీఎస్)ను హైకోర్టు ఆదేశించింది. రంగనాథ్‌పై ఇప్పటికే 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ, కోర్టు ఆదేశాలను పదేపదే ఉల్లంఘించడం ఉన్నతాధికారికి తగదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట సర్వే నంబర్లు 1, 2లోని భూములకు సంబంధించిన వ్యవహారంలో గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను హైడ్రా అధికారులు ఉల్లంఘించారని ఆరోపిస్తూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. కోర్టు స్టే ఉన్నప్పటికీ హైడ్రా సిబ్బంది భూమి ఫెన్సింగ్‌ను తొలగించారని సంస్థ వాదించింది.ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఒకే కేసులో పలుమార్లు కోర్టు ఆదేశాలను ధిక్కరించడం తీవ్ర విషయం అని హైకోర్టు వ్యాఖ్యానించింది. కోర్టును ఆశ్రయించే హక్కు ప్రతి పౌరుడికీ ఉంటుందని స్పష్టం చేసిన ధర్మాసనం, కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా వ్యవహరించడం చట్ట పరిపాలనకు విరుద్ధమని పేర్కొంది. ఈ నేపథ్యంలో తదుపరి విచారణకు రంగనాథ్ వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది.రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని పూర్తి స్థాయి అఫిడవిట్ దాఖలు చేస్తామని కోర్టుకు తెలిపారు. ఆ అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరుతూ, కోర్టుల పట్ల తనకు పూర్తి గౌరవం, నమ్మకం ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే లోతుకుంటలోని 40 ఎకరాల భూమిలోకి తాము ప్రవేశించలేదని వివరణ ఇచ్చారు.అయితే ఈ వివరణతో సంతృప్తి చెందని హైకోర్టు, రంగనాథ్‌పై ఇప్పటికే 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఎందుకు నమోదయ్యాయని ప్రభుత్వం తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. కోర్టు ఆదేశాల అమలులో ఆయన వైఖరిలో మార్పు కనిపించడం లేదని వ్యాఖ్యానిస్తూ, ఆయనను కమిషనర్ పదవి నుంచి తొలగించి కొత్త అధికారిని నియమించాలని సీఎస్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## విద్యార్థులపై దాడులు ఆపాలి మోదీ క్షమాపణ చెప్పాలి: రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 27**

దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత ధోరణిని అవలంబిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. విద్యార్థులపై కాల్పులు, లాఠీఛార్జీలు, కేసుల నమోదు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా చేసిన పోస్టులో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.బిహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే-47తో కాల్పులు జరిపారనే వార్తలు వస్తున్నాయని, వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారని రాహుల్ పేర్కొన్నారు. విద్యార్థులపై ఎలాంటి కేసులు నమోదు చేయబోమని, వారిని విడుదల చేస్తామని ప్రధాని మోదీ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. హామీకి విరుద్ధంగా విద్యార్థులపై క్రూరమైన దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు.ఢిల్లీలో విద్యార్థులపై పెల్లెట్ గన్‌లు ప్రయోగించారని, బిహార్‌లో ఏకే-47తో కాల్పులు జరిగాయని రాహుల్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బిహార్, ఢిల్లీ.. రాష్ట్రం ఏదైనా విద్యార్థుల గొంతు నొక్కివేయాలనే ధోరణే కనిపిస్తోందని విమర్శించారు.నిజమైన సంస్కరణలు తీసుకురావడం ఈ ప్రభుత్వానికి సాధ్యం కాదని తాను గతంలోనే చెప్పానని రాహుల్ అన్నారు. ఇచ్చిన హామీల నుంచి వెనక్కి తగ్గడమే కాకుండా, విద్యార్థుల గొంతు అణచివేసేందుకు అన్ని మార్గాలను ఉపయోగిస్తోందని ఆరోపించారు. దేశంలోని విద్యార్థులందరికీ ప్రధాని మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై కేసులు నమోదు చేయడం కాకుండా, వారిపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.కాగా, జులై 25న బిహార్ బంద్ సందర్భంగా సివాన్ జిల్లాలో పోలీసులు ఏకే-47తో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు రావడంతో సంబంధిత పోలీసు అధికారిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన విషయం ప్రాధాన్యం సంతరించుకుంది.

## విద్యార్థులపై పోలీసుల దాడులకు నిరసన



**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 27**

జులై 20న నిర్వహించిన 'సంసద్ మార్చ్' సందర్భంగా విద్యార్థులపై పోలీసులు దాడికి పాల్పడ్డారనే ఆరోపణలపై కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు పార్లమెంట్‌లో నిరసన చేపట్టాయి. విద్యార్థులపై జరిగిన పోలీసు దౌర్జన్యాన్ని ఖండిస్తూ, ఘటనకు బాధ్యులైన అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి.పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన చేపట్టిన విపక్ష ఎంపీలు, విద్యార్థులపై జరిగిన దాడి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ప్రతిపక్ష నేతలు స్పష్టం చేశారు.

# సింగరేణిని బీఆర్ఎస్ ప్రభుత్వం దెబ్బతీసింది: కిషన్ రెడ్డి

**హైదరాబాద్, వెలుతురు, జూలై 27:**

దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలకు, అలాగే ఎన్‌టీపీసీకి సింగరేణి నుంచి బొగ్గు సరఫరా అవుతోందని తెలిపారు. దేశ విద్యుత్ ఉత్పత్తిలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ పాలనలో సింగరేణికి తీరని నష్టం జరిగిందని, సంస్థ ఆదాయానికి గండికొట్టారని ఆరోపించారు. సింగరేణిని అభివృద్ధి దిశగా నడిపించాల్సింది పోయి రాజకీయ వేదికగా ఉపయోగించుకున్నారని విమర్శించారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సింగరేణి పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని కిషన్ రెడ్డి అన్నారు. సంస్థను బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.సింగరేణి యాజమాన్య నిర్మాణాన్ని ప్రస్తావిస్తూ, సంస్థలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం, తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో సంస్థ అభివృద్ధికి కేంద్రం తనవంతు సహకారం అందిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.



# కేంద్ర హోంమంత్రి క్షమాపణ చెప్పాలి

- **యువతకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని ప్రతిపాదన**
- **జెన్‌జీ ప్రతినిధులపై సీఎం ఆలోచనను ఇండియా కూటమి ముందు ఉంచనున్నట్లు వెల్లడి**

**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 27:**

విద్యార్థులపై జరిగిన అమానుష దాడి ఘటనకు కేంద్ర హోంమంత్రి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ వ్యవహారాన్ని కేంద్ర ప్రభుత్వం తేలికగా తీసుకోవద్దని హెచ్చరించారు.కేంద్ర విద్యాశాఖ



మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని చెప్పి ప్రభుత్వం చేతులు దులుపుకుంటే కాంగ్రెస్ ఉపేక్షించదని చామల స్పష్టం చేశారు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా కొనసాగాలంటే కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఘటనపై సమగ్ర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దేశంలో యువతకు రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సింగపూర్, బ్రిటన్ వంటి దేశాల్లో జెన్‌జీకి చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. భారత్‌లో కూడా 21 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు గల యువతకు శాసనసభలు, పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం కల్పిస్తే వారి సమస్యలపై పూర్తి అవగాహనతో చర్చించి సమర్థవంతమైన పరిష్కారాలు కనుగొనవచ్చని అన్నారు.ఈ ప్రతిపాదనను ఇండియా కూటమి నేతల ముందుకు తీసుకెళ్లాలని తెలంగాణ ముఖ్యమంత్రి భావిస్తున్నారని చామల కిరణ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. యువత రాజకీయాల్లో భాగస్వామ్యం పెరగడం ప్రజాస్వామ్యానికి మరింత బలం చేకూరుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# మహేశ్వరం తెలంగాణ మోడల్ స్కూల్...

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొంటూ, ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలు, సాంకేతిక వనరులు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, వసతి గృహాలు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర మౌలిక వసతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ఉపాధ్యాయులు, అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన వసతుల మంజూరుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.పాఠశాల సమయాల్లో విద్యార్థుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) బస్సు సేవలను పాఠశాల వరకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.సందర్శన ముగింపులో పాఠశాల ఆవరణలో మొక్కను నాటిన ప్రధాన కార్యదర్శి, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీ శశాంక్, శ్రీ కృష్ణ ఆదిత్య జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టేందుకు...

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఊరికి ఊట కుంట నిర్మించాలనే లక్ష్యంతో అందరూ కలిసి పనిచేయాలని ఆమె అన్నారు. ఈ నిర్మాణాల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాల మట్టాన్ని పెంచడంతో పాటు భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించవచ్చని తెలిపారు.జల సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత



అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగిస్తూ, వర్షపు నీటి సంరక్షణకు తమ వంతు సహకారం అందించాలని కోరారు."జల సంరక్షణే మన భవిష్యత్తుకు భరోసా. తెలంగాణ జలసిరిని ప్రజలందరం కలిసి విజయవంతం చేద్దాం. ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టి సస్యశ్యామల తెలంగాణ నిర్మాణానికి మనమంతా భాగస్వాములు కావాలి" అని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# ఉత్తర తెలంగాణ అభివృద్ధికి ఉత్ప్రేరకంగా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు: బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**హైదరాబాద్,వెలుతురు జులై 27:**

ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయనున్న జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్ ఉత్తర తెలంగాణ సమగ్ర అభివృద్ధికి కేంద్రబిందువుగా మారనుందని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి రావడం ద్వారా ఆదిలాబాద్ జిల్లా ప్రధాన పారిశ్రామిక, లాజిస్టిక్స్, పర్యాటక కేంద్రంగా రూపాంతరం చెందుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ విమానాశ్రయాన్ని రక్షణ మంత్రిత్వ శాఖ, భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ సంయుక్తంగా అభివృద్ధి చేయనున్నాయని పాయల్ శంకర్ వివరించారు. మొత్తం రూ. 5,500 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వం రూ. 2,278 కోట్లు, రక్షణ మంత్రిత్వ శాఖ రూ. 3,000 కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే ఈ ప్రాజెక్టు సాధ్యమైందని, వెనుకబడిన ఆదిలాబాద్ ప్రాంతాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారని గుర్తుచేశారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక పార్కును ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. దీనికోసం ఇప్పటికే 2,200 ఎకరాల భూసేకరణ ప్రక్రియ వేగవంతం కాగా, మరో 6,000 ఎకరాల సేకరణ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ విమానాశ్రయం, ఇండస్ట్రియల్ కారిడార్ రాకతో జౌళి (టెక్స్‌టైల్), వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు (ఆగ్రో ప్రాసెసింగ్), టూరిజం రంగాలు ఊపందుకోవడమే కాకుండా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.ఈ ప్రాజెక్టుకు సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, రామ్మోహన్ నాయుడుతో పాటు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి పాయల్ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి సమక్షంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందని, అనంతరం ప్రధాని చేతుల మీదుగా ప్రాజెక్టు ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపారు.

# మహంకాళీ బోనాలకు శ్రీధర్‌బాబుకు ఆహ్వానం



**హైదరాబాద్, వెలుతురు జులై 27:**

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆషాఢమాస బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆలయ పాలకమండలి సభ్యులు ఆహ్వానించారు. సోమవారం సచివాలయంలో మంత్రిని కలిసిన పాలకమండలి ప్రతినిధులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆగస్టు 2న జరిగే బోనాల ఉత్సవం, ఆగస్టు 3న నిర్వహించే రంగం, ధ్వజారోహణ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.ఈ సందర్భంగా ఈవో మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రామతీర్థ శర్మ, వేణుమాధవ శర్మ వేదమంత్రోచ్చారణలతో మంత్రిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దేవీవర ప్రసాద్, మంత్రి సోనాల్, మల్లిఖార్జున్, గంటా గీత, కిరణ్ ముప్పిడి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధికి కేంద్ర మంత్రులతో కీలక చర్చలు

- తాడిచెర్ల-2 ప్రాజెక్టును వేగవంతం చేయాలి.. స్థానికులకు 1000 ఉద్యోగాలు కల్పించాలి
- సింగరేణి రిటైర్డ్ కార్మికులకు కనీసం రూ.10 వేల పెన్షన్ అందించాలి
- కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర ప్రయోజనాలపై వినతిపత్రాలు అందజేసిన మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**న్యూఢిల్లీ, వెలుతురు జూలై 27:**





తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతూ శక్తి (కార్మిక, శిక్షణ, ఉపాధి & ఫ్యాక్టరీస్) మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణతో కలిసి సోమవారం న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, గనుల పురోగతి, మౌలిక వసతుల విస్తరణ, కార్మిక సంక్షేమానికి సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించారు.ముందుగా కేంద్ర కార్మిక & ఉపాధి శాఖ మంత్రి డా. మన్సుఖ్ మాండవీయను కలిసి తెలంగాణలో కార్మిక సంక్షేమ కార్యక్రమాల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపు, కేంద్ర పథకాల అమలులో రాష్ట్రానికి మరింత సహకారం అందించాలని కోరారు. అనంతరం కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరిని కలిసి యువతకు అత్యాధునిక నైపుణ్య శిక్షణ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల అభివృద్ధి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాల విస్తరణపై చర్చించారు.తదనంతరం కేంద్ర బొగ్గు & గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని కలిసి పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి అత్యంత కీలకమైన తాడిచెర్ల-2 బొగ్గు గని ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు ఆలస్యం కాకుండా త్వరగా పూర్తి చేసి, స్థానిక యువతకు కనీసం వెయ్యి ఉద్యోగాలు కల్పించాలని, ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల వారికి ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. నిర్వాసిత కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద సమగ్ర పునరావాసం, పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని కూడా విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా సింగరేణి సంస్థలో పదవీ విరమణ పొందిన కార్మికులకు కనీస నెలవారీ రూ.10 వేల పెన్షన్ అందేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తక్కువ పెన్షన్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేలాది మంది రిటైర్డ్ కార్మికుల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సింగరేణి విస్తరణ, కొత్త బొగ్గు గనుల అభివృద్ధి, గనుల ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర సహకారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అంశాలను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా తాడిచెర్ల-2 ప్రాజెక్టు పనుల వేగవంతం, స్థానికులకు ఉద్యోగాల కల్పన, ఆర్‌అండ్‌ఆర్ అమలు, సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ అంశాలను సంబంధిత శాఖలతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, "తెలంగాణ అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల విస్తరణ, కార్మికుల సంక్షేమం, గనుల అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంగా పనిచేస్తాం. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన ప్రతి అంశంపై నిరంతరం కృషి చేస్తూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నాం" అని పేర్కొన్నారు.

# ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్..

## రాజ్‌ఘాట్‌కు వెళ్లనున్న సోనమ్ వాంగ్‌చుక్

- ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్లు వెల్లడి
- ముందుగా రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీకి నివాళి
- అనంతరం తిరిగి పర్వత ప్రాంతాలకు ప్రయాణం
- అభిమానుల ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు

**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 27:**



సామాజిక కార్యకర్త, పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్లు తెలిపారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించిన ఆయన, ముందుగా ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్మా గాంధీకి నివాళులర్పిస్తానని, అనంతరం తిరిగి పర్వత ప్రాంతాలకు వెళ్తానని చెప్పారు.తన ఆరోగ్యం కోసం ప్రార్థించిన, శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గురుగ్రామ్‌లోని మెదాంతా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది అందించిన సేవలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆయన ఆరోగ్యం మెరుగుపడటంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు వెల్లడించారు.

# ఆందోళనకారులపై కేసులు ఎత్తేయాలి.. లేదంటే మళ్లీ ఉద్యమం: సీజేపీ హెచ్చరిక

- నిరసనకారులపై నమోదైన కేసులు ఉపసంహరించుకోవాలని కేంద్రానికి డిమాండ్
- హామీ ఇచ్చి మాట తప్పిందని కేంద్రంపై సీజేపీ ఆరోపణ
- అరెస్టయిన విద్యార్థులు, నిరసనకారులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి



- రేపటిలోగా చర్యలు లేకుంటే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్న సౌరవ్ దాస్
- జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ జోక్యం చేసుకోవాలని కోరిన సీజేపీ
- బిహార్‌లో ఏకే-47 ఘటనపై రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు

**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 27:**

పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులు, నిరసనకారులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కాక్రోచ్ జనతా పార్టీ (CJP) అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్రం తమకు ఇచ్చిన హామీని ఇప్పటికీ అమలు చేయలేదని ఆరోపించారు.పేపర్ లీక్‌ల అంశంపై నిరసనలు కొనసాగుతున్న సమయంలో కేంద్ర మంత్రులు తమతో చర్చలు జరిపి, విద్యార్థులు, నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకుంటామని హామీ ఇచ్చారని సౌరవ్ దాస్ తెలిపారు. ఆ హామీని నమ్మి తాము దేశవ్యాప్తంగా నిరసనలను విరమించుకున్నామని చెప్పారు. అయితే ఇప్పటి వరకు ఆ హామీ అమలు కాలేదని, పలు రాష్ట్రాల్లో కేసులు కొనసాగుతుండటంతో పాటు అరెస్టులు కూడా జరుగుతున్నాయని ఆరోపించారు.అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్ తదితర రాష్ట్రాల్లో పలువురు ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ కేసులపై న్యాయపరమైన చర్యల కోసం న్యాయవాదులను సంప్రదిస్తున్నామని తెలిపారు. రేపటిలోగా దేశవ్యాప్తంగా విద్యార్థులు, నిరసనకారులపై నమోదైన అన్ని కేసులను ఉపసంహరించుకోవాలని, ప్రస్తుతం నిర్బంధంలో ఉన్న వారిని వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు.ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకుని ఇచ్చిన హామీని అమలు చేయాలని సౌరవ్ దాస్ కోరారు. విద్యార్థులపై నమోదైన కేసుల అంశాన్ని ప్రభుత్వం మరింత ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని అన్నారు.మరోవైపు బిహార్‌లో విద్యార్థుల నిరసనల సందర్భంగా పోలీసుల చర్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. బిహార్‌లో విద్యార్థులపై ఏకే-47 తుపాకులు ఎక్కుపెట్టారని, ఢిల్లీలో విద్యార్థులపై పెల్లెట్ గన్‌లు ఉపయోగించారని ఆరోపించారు. విద్యార్థుల గొంతును అణచివేసేందుకే కేంద్ర ప్రభుత్వం తప్పుడు హామీలు ఇస్తోందని విమర్శించారు.కాగా, జులై 25న 'బిహార్ బంద్' సందర్భంగా సివాన్ జిల్లాలో ఓ పోలీసు కానిస్టేబుల్ నిరసనకారులపై ఏకే-47 తుపాకిని గురిపెట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటన తీవ్ర వివాదాస్పదంగా మారడంతో సంబంధిత కానిస్టేబుల్‌ను అధికారులు సస్పెండ్ చేశారు.

# కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రహదారి అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించిన తెలంగాణ రాష్ట్ర ఐటీ & పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**కుత్బుల్లాపూర్ వెలుతురు జూలై 27:**






కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొంపల్లి–బహదూర్‌పల్లి రహదారి, మియాపూర్–గండిమైసమ్మ చౌరస్తా రహదారి అభివృద్ధి పనుల పురోగతిని తెలంగాణ రాష్ట్ర ఐటీ & పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరిశీలించారు. సోమవారం కుత్బుల్లాపూర్ మండలంలోని కొంపల్లి–బహదూర్‌పల్లి రహదారి, మియాపూర్–గండిమైసమ్మ చౌరస్తా రహదారి అభివృద్ధి పనులను పరిశీలించేందుకు విచ్చేసిన మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు జిల్లా కలెక్టర్ మను చౌదరి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రహదారి అభివృద్ధి పనులలో భూనిర్వాసితులకు ముందుగా నష్టపరిహారం అందించాలని సైబరాబాదు కమీషనర్ సృజనకు సూచించారు. అటవీ శాఖ అనుమతులు సాధించి, ప్రజల ఎన్నో ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యుత్తుశాఖ వారి పనులలో భాగంగా ఎలక్ట్రిక్ పోల్ షిఫ్టింగ్ ఎంత వరకు అయ్యాయని, మిగిలినవి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్డు పనుల నిరంతరాయ అమలుకు వీలు కల్పించేందుకు, దూలపల్లి మరియు బహదూర్పల్లి గ్రామాలలో భూసేకరణ ప్రక్రియను ప్రాధాన్యతా క్రమంలో వేగవంతం చేసి పూర్తి చేయాలని కొంపల్లి మరియు దుండిగల్ డిప్యూటీ కమిషనర్ను ఆదేశించడం జరిగింది. అటవీ ప్రాంతంలో ఉన్న అన్ని విద్యుత్ స్తంభాలను ఆగస్టు 15వ తేదీలోగా తరలించే పనిని, హెచ్ఎండిఏ సహకారంతో ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని టిజిఎస్పిడిసిఎల్ కు సూచించారు. విద్యుత్ స్తంభాల మార్పిడి పూర్తయిన వెంటనే మిగిలిన రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించి, సెప్టెంబర్ నెలాఖరులోగా మొత్తం రోడ్డు పని పూర్తయ్యేలా చూడాలని హెచ్ఎండిఏ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రాజెక్ట్ పరిధిలోని డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడానికి తదుపరి అవసరమైన చర్యలు తీసుకోవడం కోసం, ప్రతిపాదిత తుఫాను నీటి కాలువ యొక్క అలైన్మెంట్తో సహా వివరణాత్మక ప్రతిపాదనను సిద్ధం చేసి, వీలైనంత త్వరగా పరిశీలన నిమిత్తం CMC కమీషనర్ కు సమర్పించాలని HMDA ఆదేశాలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకెష్ కుమార్, డిసిలు , ఇంజనీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, హెచ్ఎండిఎ, టిజిఎస్పిడిసిఎల్, అటవీ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో షాక్

- కరూర్ తొక్కిసలాట బాధిత కుటుంబాలకు ఇచ్చిన ఉద్యోగాలు చెల్లవన్న కోర్టు
- ప్రభుత్వ ఉద్యోగాలు ఉచితంగా పంచిపెట్టేవి కావని స్పష్టం
- నియామకాలు రాజ్యాంగ, చట్టపరమైన విధానాల ప్రకారమే జరగాలని సూచన
- ప్రభుత్వ చర్యలపై నియంత్రణ లేకుంటే అరాచకం పెరుగుతుందని వ్యాఖ్య
- టీఎన్‌పీఎస్సీ నిబంధనలను పక్కన పెట్టలేమన్న హైకోర్టు

**చెన్నై, వెలుతురు, జూలై 27:**




తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కరూర్ తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం కల్పించిన తాత్కాలిక ప్రభుత్వ ఉద్యోగాలు చట్టబద్ధం కావని హైకోర్టు తేల్చిచెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ రాజ్యాంగ, చట్టపరమైన నిబంధనలకు లోబడి జరగాల్సిందేనని స్పష్టం చేసింది.గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన టీవీకే (TVK) ర్యాలీలో తొక్కిసలాట చోటుచేసుకుని 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ ఘటన అనంతరం బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని విజయ్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కరూర్ వెళ్లి అర్హతలున్న 32 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో తాత్కాలిక నియామక పత్రాలు అందజేశారు.ఈ నియామకాలపై అన్నాడీఎంకే నేత ఆర్.బి. ఉదయ్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి అమల్లో ఉన్న చట్టపరమైన విధానాలను పక్కనబెట్టి నియామకాలు చేపట్టారని, తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (TNPSC) ద్వారా మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ జరగాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వ ఉద్యోగం అనేది ఉచితంగా పంచిపెట్టే అంశం కాదని, దానిని అభ్యర్థులు పోటీ పరీక్షలు, ఎంపిక ప్రక్రియల ద్వారా కష్టపడి సాధించాలని పేర్కొంది. ప్రభుత్వ చర్యలకు రాజ్యాంగపరమైన పరిమితులు తప్పనిసరిగా ఉండాలని, లేకపోతే అరాచకం, అశాంతి రాజ్యమేలే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో కరూర్ తొక్కిసలాట బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన తాత్కాలిక ఉద్యోగ నియామకాలు చెల్లవని హైకోర్టు తీర్పు వెలువరించింది.

# సమన్వయంతో ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను వందశాతం పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట, వెలుతురు, జూలై 27:**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్.) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఓటరు ఎన్యూమరేషన్ పత్రాల సేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుందని జిల్లా కలెక్టర్ ప్రియాంక తెలిపారు. జిల్లాలో ఇప్పటికే దాదాపు 95 శాతం ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. మిగిలిన 5 శాతాన్ని బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సమన్వయంతో పూర్తి చేసి వందశాతం లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్.ఐ.ఆర్. పురోగతిపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.ఎన్యూమరేషన్ పత్రాల సేకరణ అనంతరం రేషనలైజేషన్ ప్రక్రియ చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఒక ఓటరుకు ఒకే చోట మాత్రమే ఓటు హక్కు ఉండాలని, రెండు చోట్ల ఓటరు పేర్లు ఉండకూడదని స్పష్టం చేశారు. మిగిలిన 5 శాతం ఓటర్లలో కొందరి పేర్లు రెండు ప్రాంతాల్లో ఉండే అవకాశం ఉన్నందున, తమ ఓటు ఎక్కడ కొనసాగించాలనుకుంటున్నారో నిర్ణయించుకుని, మరో ప్రాంతంలోని ఓటును రద్దు చేయించుకునేలా సంబంధిత బీఎల్‌వోకు సమాచారం అందించాలని కోరారు. రాజకీయ పార్టీల బీఎల్ఏలు తమ పరిధిలో ఇంకా ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించని ఓటర్లకు అవగాహన కల్పించి, త్వరితగతిన పత్రాలు పూర్తి చేసి అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్వో రాజేశ్వరి, సీ-సెక్షన్ అధికారి జయసుధతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అబ్దుల్ సలీమ్, కెంచి శ్రీను, మహమ్మద్ సలీమ్, వెంకట్రాం రెడ్డి, రాఘవ చౌదరి, కెంచి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



# నగరాల విస్తరణ... హృదయాల సంకోచం!




ఒకప్పుడు మన వీధి చివరి ఇంటి తలుపు తెరుచుకున్నా, ఆ వార్త వీధి మొత్తానికి తెలిసేది. పక్కింటివారు వచ్చి ఆత్మీయంగా పలకరించేవారు. కష్టమొచ్చినా, సుఖమొచ్చినా ఊరంతా కలిసి పంచుకునేది. పండగలు వస్తే చాలు.వీధి మొత్తం ఒక పెద్ద కుటుంబంలా సందడిగా మారేది. కానీ ఈ రోజు మన నగరాల్లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పక్కింటివారి పేరు కూడా తెలియని ఇళ్ళు నేడు లక్షల్లో ఉన్నాయి. ప్రధాన ద్వారం దగ్గర అత్యాధునిక సెక్యూరిటీ కెమెరాలు ఉన్నాయి కానీ, ఎదుటివారిని చూసి హృదయాన్ని తెరిచే మనుషులు మాత్రం కరువవుతున్నారు.ఇదే నేటి ఆధునిక సమాజం ఎదుర్కొంటున్న అతిపెద్ద నిశ్శబ్ద సంక్షోభం ఆత్మీయతల కరవు.నేడు కాంక్రీట్ భవనాలు పెద్దవి అవుతున్నాయి, కానీ మనుషుల హృదయాలు మాత్రం రోజురోజుకూ చిన్నవి అయిపోతున్నాయి. బ్యాంక్ బ్యాలెన్స్‌లు, జీతాల అంకెలు పెరుగుతున్నాయి, కానీ కష్టమొచ్చినప్పుడు పక్కన నిలబడి ధైర్యం చెప్పే ఆత్మీయుల సంఖ్య దారుణంగా తగ్గిపోతోంది. ఇది కేవలం ఒక నిర్దిష్ట నగరానికో లేదా సాంకేతిక రంగానికో పరిమితమైన సమస్య కాదు; గ్రామాల నుండి మహానగరాల వరకు, పసిపిల్లల నుండి వృద్ధుల వరకు అందరినీ ఏదో ఒక రూపంలో నిశ్శబ్దంగా వేధిస్తున్న సామాజిక సమస్య ఇది.అభివృద్ధి, సాంకేతిక పురోగతి అనేవి సమాజానికి నిస్సందేహంగా అవసరమే. సాంకేతికత మనిషి భౌతిక జీవితాన్ని ఎంతో సులభతరం చేసింది, సుదూర తీరాలను దగ్గర చేసింది. కానీ విచారకరమైన నిజమేమిటంటే అదే సాంకేతికత పక్కనే ఉన్న మానవ సంబంధాలను క్రమంగా దూరం చేస్తోంది.ఒకప్పుడు కుటుంబం మొత్తం ఒకే చోట కూర్చుని భోజనం చేస్తూ, ఆనాటి కష్టసుఖాలు ముచ్చటించుకునేది. ఇప్పుడు అదే కుటుంబం ఒకే కప్పు కింద, ఒకే గదిలో కూర్చున్నా ఎవరి స్మార్ట్‌ఫోన్‌లో వారు మునిగిపోతున్నారు. తల్లిదండ్రులు పిల్లలతో మనస్ఫూర్తిగా మాట్లాడే సమయం తగ్గిపోయింది; పిల్లలు పెద్దల మాటలను ఓపికగా వినే మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారు.ఇంటర్నెట్ లోకం పుణ్యమా అని సోషల్ మీడియాలో వేల సంఖ్యలో వర్చువల్ స్నేహితులు ఉన్నారు. కానీ కష్టమొచ్చినప్పుడు, గుండెల్లో బాధను పంచుకోవడానికి ఇంటి తలుపు తట్టి పలకరించే ఒక్క నిజమైన స్నేహితుడు కూడా దొరకని పరిస్థితిని ఈనాటి తరం ఎదుర్కొంటోంది. ఉద్యోగ ఒత్తిడి, అంతులేని పోటీతత్వం, డబ్బు వెంట పరిగెత్తే రేసు ఇవన్నీ కలిసి మనిషిని ఒక రకమైన యంత్రంగా మార్చేస్తున్నాయి.ఉదయం లేచిన దగ్గర్నుంచి రాత్రి నిద్రపోయే వరకు కేవలం ఆర్థిక లక్ష్యాల వెంట పరుగెత్తడమే జీవితంగా మారిపోయింది. ఈ క్రమంలో మనిషి తన చుట్టూ ఉన్న తోటి మనుషులను పట్టించుకోవడం ముమ్మాటికీ మానేశాడు. తల్లిదండ్రులు వృద్ధాప్యంలో వృద్ధాశ్రమ బాట పట్టడం, పిల్లలు ఒంటరితనంతో పెరగడం, నగరాల్లో వృద్ధులు ఇళ్ళల్లోనే ఒంటరిగా మరణించి రోజుల తరబడి ఎవరికీ తెలియకపోవడం వంటి ఘోరమైన సంఘటనలు ఈ సామాజిక క్షీణతకు స్పష్టమైన నిదర్శనాలు.స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే ప్రపంచం మొత్తం మన అరచేతిలో ఉన్నట్టే అనుకుంటున్నాం. కానీ అదే ఫోన్ మన పక్కన కూర్చున్న మనిషి నుండి మనల్ని మానసికంగా వేరు చేస్తోంది. సోషల్ మీడియా ఖాతాల్లో వందల మంది ఫ్రెండ్స్ ఉంటారు, పందొమ్మిది వందల మంది ఫాలోవర్లు ఉంటారు. కానీ అర్ధరాత్రి కంటిపాప నుండి కన్నీరు కారినప్పుడు వచ్చి ఓదార్చే ఒక్క మనిషి కూడా దొరకడం లేదు.లైక్‌లు, కామెంట్లు, రీల్స్ ఇవి మెదడుకు క్షణికమైన ఆనందాన్ని (డోపమైన్) ఇస్తాయేమో కానీ, నిజమైన మానవ అనుబంధం ఇచ్చే భద్రతను, నమ్మకాన్ని ఎప్పటికీ ఇవ్వలేవు. డిజిటల్ ప్రపంచంలో బంధాలు పెరుగుతున్న కొద్దీ, వాస్తవ ప్రపంచంలో మానవ సంబంధాలు అంతకంతకూ బలహీనపడుతున్నాయి. ఇది ఒక ఆశ్చర్యకరమైన వైరుధ్యం, మనం ఎంత ఎక్కువగా నెట్‌వర్క్‌తో కనెక్ట్ అయి ఉన్నామో, సమాజంలో అంత ఎక్కువగా ఒంటరిగా మారుతున్నాము.మానసిక ఆరోగ్య నిపుణులు, మానసిక వైద్యులు కూడా ఈ ప్రమాదాన్ని పదేపదే హెచ్చరిస్తున్నారు. గత రెండు దశాబ్దాల్లో యువతలోనూ, వృద్ధుల్లోనూ డిప్రెషన్, ఆందోళన, తీవ్రమైన ఒంటరితనం వంటి సమస్యలు నూటికి నూరు శాతం పెరిగాయి. దీనికి ప్రాథమిక కారణం సామాజిక మద్దతు లోపించడమే. మనిషి ప్రాథమికంగా ఒక సామాజిక జీవి. అతనికి కేవలం ఆహారం, నివాసం, బ్యాంక్ బ్యాలెన్స్ మాత్రమే సరిపోవు; మరొక మనిషి స్పర్శ, పలకరింపు, ఆప్యాయమైన తోడు ఖచ్చితంగా కావాలి. ఆ ప్రాథమిక అవసరాన్ని ఆధునిక జీవనశైలి సంపూర్ణంగా దెబ్బతీస్తోంది.గ్రామాల నుండి నగరాలకు ఉపాధి కోసం వలసలు పెరిగే కొద్దీ, మనుషులు తమ సంస్కృతి, మూలాలు మరియు విస్తృత కుటుంబ వ్యవస్థ నుండి దూరమవుతున్నారు. కొత్త ప్రదేశాల్లో బతుకుదెరువు కోసం నిరంతరం పోరాడుతూ ఆత్మీయ బంధాలను వదిలేస్తున్నారు.అపార్ట్‌మెంట్ మరియు గేటెడ్ కమ్యూనిటీ సంస్కృతి పెరిగిన తర్వాత నా ఇల్లు, నా స్వేచ్ఛ, నా గోప్యత అనే భావన అమితంగా బలపడింది. ఇది వ్యక్తిగత గోప్యతకు స్వేచ్ఛను ఇచ్చిందేమో కానీ, మన ప్రాచీన సామూహిక జీవనానికి, పరస్పర సహకారానికి పెద్ద గొడ్డలి పెట్టుగా మారింది.దానికి తోడు, నాకేంటి లాభం? అనే వాణిజ్య సూత్రం ఈనాడు రక్తం పంచుకున్న బంధాల్లోకి కూడా చొచ్చుకుపోయింది. స్నేహాలు, బంధుత్వాలు కూడా ప్రాధాన్యతలు, వ్యక్తిగత ప్రయోజనాల ఆధారంగా కొలవబడుతున్నాయి. నిస్వార్థమైన స్నేహం, నిష్కల్మషమైన ఆత్మీయత రోజురోజుకూ కనుమరుగవుతున్నాయి. లాభనష్టాల బేరీజు మొదలైన చోట నిజమైన ప్రేమానురాగాలు నిలబడలేవు.ఈ మార్పుల వల్ల అత్యధికంగా నష్టపోతున్నది యువత మరియు వృద్ధులే. కళాశాలల్లో వందల మంది తోటి విద్యార్థుల మధ్య కూర్చున్నా, తమ మనసులోని బాధను లేదా ఒత్తిడిని ఎవరితో పంచుకోవాలో తెలియక యువత నలిగిపోతోంది. పరీక్షల్లో మార్కులు తగ్గినా, ఉద్యోగంలో విఫలమైనా, ప్రేమలో ఎదురుదెబ్బ తగిలినా ధైర్యం చెప్పే పెద్దలు లేదా ఓదార్చే స్నేహితులు అందుబాటులో లేకపోవడం వల్ల నేడు అనేక మంది తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు.మరోవైపు, విదేశాలలో లేదా ఇతర నగరాల్లో స్థిరపడిన పిల్లల కోసం నిరీక్షిస్తూ, ఒంటరిగా కాలం వెళ్ళదీస్తున్న వృద్ధుల పరిస్థితి వర్ణనాతీతం. ఫోన్లలో వీడియో కాల్స్ సౌకర్యాన్ని ఇచ్చినా, పక్కన కూర్చుని చేయి పట్టుకుని మాట్లాడే అనుభూతిని అవి భర్తీ చేయలేవు.సామాజిక విచ్ఛిన్నత అనేది శాశ్వతంగా కోల్పోయిన మార్గం కాదు. ఈ మార్పు మన వ్యక్తిగత స్థాయిలోనే, మన ఇళ్ళ నుండే మొదలవ్వాలి. ప్రతి కుటుంబం రోజుకు కనీసం ఒక గంట ఫోన్‌లను పక్కన పెట్టి, కుటుంబ సభ్యులందరూ కలిసి మాట్లాడుకోవాలి. పిల్లలకు తాతయ్యలు, అమ్మమ్మల కథలను, అనుభవాలను వినే వాతావరణాన్ని కల్పించాలి. పండగలను సోషల్ మీడియా పోస్టులకే పరిమితం చేయకుండా, ప్రత్యక్షంగా కలుసుకుని జరుపుకోవాలి. పక్కింటివారిని ప్రతినిత్యం చిరునవ్వుతో పలకరించడం అలవాటు చేసుకోవాలి.పాఠశాలలు కూడా కేవలం ర్యాంకుల వెంట పరుగెత్తించకుండా విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను, సహానుభూతిని పెంచే దిశగా కృషి చేయాలి. సమాజంలో మనిషిని మనిషిగా నిలబెట్టేది కేవలం సాంకేతికత లేదా సంపద మాత్రమే కాదు మరొక మనిషితో మనకున్న నిజమైన, నిస్వార్థమైన ఆత్మీయ అనుబంధమే. ఆ అనుబంధాలను కాపాడుకోవడమే రేపటి తరానికి మనం ఇవ్వగలిగే అతిపెద్ద ఆస్తి.



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# సంస్కృతి-సాంప్రదాయాల పరిరక్షణలో డా. మల్లారెడ్డి పెద్దన్న పాత్ర





- **అమెరికాలో తెలంగాణ ఉద్యమ కళాకారులతో ఆత్మీయ కలయిక**
- **పాటలు, పల్లె సంస్కృతి, ఉద్యమ జ్ఞాపకాలతో కళాకారుల సందడి**
- **తెలంగాణ ఆత్మను విదేశీ గడ్డపై సజీవంగా ఉంచాలని పిలుపు**

**అమెరికా వెలుతురు తెలంగాణ బ్యూరో:**

విదేశాల్లో పెరుగుతున్న కొత్త తరానికి తెలంగాణ చరిత్ర, సంప్రదాయాలు, బతుకమ్మ, బోనాలు, జానపద కళారూపాలు, ఉద్యమ స్ఫూర్తిని పరిచయం చేయడంలో డా. పైళ్ల మల్లారెడ్డి పెద్దన్న పాత్ర పోషిస్తున్నారని తెలంగాణ కళాకారులు పేర్కొన్నారు. అమెరికాలో తెలంగాణ సంస్కృతి, భాష, సాహిత్య పరిరక్షణ కోసం పనిచేస్తున్న ప్రవాస సంఘాల సేవలను ఈ సందర్భంగా కళాకారులు అభినందించారు. న్యూయార్క్‌లోని లాంగ్ ఐలాండ్‌లో ప్రముఖ ప్రవాస తెలంగాణవాది లక్ష్మణ్ అనుగు నివాసంలో డా. పైళ్ల మల్లారెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ కళాకారులతో ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. తెలంగాణ ఉద్యమంలో పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపిన ప్రముఖ కళాకారులు ఒకే చోట కలుసుకోవడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ రాష్ట్ర సాధనలో కళాకారుల పాత్ర చిరస్మరణీయమని డా. మల్లారెడ్డి పేర్కొన్నారు . ఉద్యమ కాలంలో పాటల ద్వారా ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిన కళాకారులను విదేశీ గడ్డపై కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రవాస తెలంగాణవాసులు తమ మూలాలను మరువకుండా భాష, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అమెరికాలో నివసిస్తున్న తెలంగాణ కుటుంబాలు తమ పిల్లలకు మాతృభాషతో పాటు తెలంగాణ సంస్కృతిని పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాకారులతో ప్రత్యక్షంగా మమేకం కావడం ద్వారా యువతలో తెలంగాణ చరిత్రపై మరింత అవగాహన పెరుగుతుందని చెప్పారు. తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (టీటీటీ) అధ్యక్షుడిగా ఎన్నికైన పెద్దిరెడ్డిని ఘనంగా సన్మానించారు.

ఉద్యమ సమయంలో జరిగిన అనేక సంఘటనలను గుర్తు చేసుకుంటూ కళాకారులు తమ అనుభవాలను పంచుకోవడం ప్రత్యేక ఆకర్షణ నిలిచింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్, జానపద కళాకారుడు నల్గొండ గద్దర్ నర్సిరెడ్డి, జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ గేయ రచయిత కాసర్ల శ్యామ్, మాజీ ఎమ్మెల్యే, ప్రజా గాయకుడు రసమయి బాలకిషన్, జానపద గాయని యాత సంధ్య పాల్గొన్నారు. సమావేశంలో న్యూయార్క్ తెలంగాణ తెలుగు అసోషియేషన్ (ఎన్‌వైటీటీఏ) టీటీఏ సభ్యులు కళాకారులు తెలంగాణ ఉద్యమం సందర్భంగా రచించిన గేయాలు, ప్రజల్లో చైతన్యం కలిగించిన పాటలు ఆలపించగా, ప్రవాస తెలంగాణవాసులు ఉత్సాహంగా స్పందించారు.

# రోడ్ల అభివృద్ధిని చూసి ఓర్వలేకే భారాస డ్రామాలు

- **కాంగ్రెస్ నేతల ఆగ్రహం**

**శంకర్పల్లి, వెలుతురు జులై 27 :**

చిన్నచిన్న తప్పులను ఎత్తిచూపుతూ రాజకీయం చేయాలనుకునే భారాస నాయకులు, ఆ సమస్యలు ఎప్పటి నుంచి ఉన్నాయో ఒకసారి గుర్తుచేసుకుని మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శంకర్పల్లి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్ రెడ్డి, మండలాధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు చంద్రమౌళి కలిసి మాట్లాడారు. నిధులు కేటాయించి, త్వరలోనే ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రోడ్ల వద్ద ఆదివారం భారాస నాయకులు చేసిన ధర్నాను వారు తీవ్రంగా తప్పుపట్టారు. నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతున్న సమయంలో అనవసర ఆందోళనలు సృష్టించి, ఆ పనులన్నీ తామే చేశామని చెప్పుకోవడం భారాసకు అలవాటుగా మారిందని దుయ్యబట్టారు.

## రూ.300 కోట్లతో రోడ్ల అభివృద్ధి

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గ పరిధిలోని రోడ్ల అభివృద్ధి కోసం రూ.300 కోట్ల భారీ నిధులను కేటాయించిందని ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. నిన్న భారాస నాయకులు ధర్నా చేసిన రోడ్డుకు సైతం ప్రత్యేక ప్రాజెక్టు కింద రూ.40 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం ఆ పనులు టెండర్ దశలో ఉన్నాయని వారు గుర్తు చేశారు. గత పదేళ్ల కాలంలో భారాస ప్రభుత్వం చేయని అభివృద్ధిని, కాంగ్రెస్ పార్టీ కేవలం రెండేళ్ల వ్యవధిలోనే చేసి చూపిందని ధీమా వ్యక్తం చేశారు.

## ధరణితో రైతులను ముంచారు

గత ప్రభుత్వం తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్ వల్ల రైతులు తీవ్ర అవస్థలు పడ్డారని, దానికి భారాస ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని వారు ఆరోపించారు. రైతుల ఇబ్బందులను తొలగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని పేర్కొన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రకాష్ గుప్తా, పాండురంగారెడ్డి, రఘునందన్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాసెట్టి చంద్రమోహన్, పార్సీ బాలకృష్ణ, కావలి గోపాల్, ప్రశాంత్, శ్రీకాంత్, యువ నాయకుడు ప్రశాంత్ రెడ్డి, సమీ తదితరులు పాల్గొన్నారు.



# గుట్ట ప్రభుత్వ పాఠశాలకు రక్షణ చర్యలు చెప్పటండి:సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 27:**



సోమవారం ప్రజావాణి సందర్భంగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో జగద్గిరిగుట్ట మరియు గాజుల రామారావు డివిజన్ సమస్యలపైన అధికారులను కలిసి రోడ్డు అక్రమ పార్కింగ్ మరియు ప్రభుత్వ పాఠశాల రక్షణ కొరకు చర్యలు చేపట్టాలని ఈ గోవర్ధన్ మరియు బద్రి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు వారాల క్రితం జరిగిన ప్రజావాణిలో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ కి జగద్గిరిగుట్టలో రోడ్డు ఆక్రమణలు పుట్పాత్ నిర్మాణం మరియు గాజులరామారం డివిజన్లోని రోడ్డు బాగు కొరకు వినతి పత్రం ఇస్తే ఇప్పటివరకు అధికారుల నుండి ఎలాంటి స్పందన లేదని ఇప్పటికైనా స్పందించకపోతే ప్రజావాణి ఎందుకని అధికారులను ప్రశ్నించారు. అదేవిధంగా జగద్గిరిగుట్ట ఉన్నత పాఠశాలలో ప్రహరీ గోడ చిన్నగా ఉండడం వల్ల రాత్రి సమయంలో సెలవు దినాల్లో ఆకతాయిలు వచ్చి పాఠశాల వాతావరణాన్ని చెడగొడుతున్నారని కావున ప్రహరీ గోడ ఎత్తును పెంచాలని కోరడం జరిగింది. పై సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఉద్యమం చేయాల్సి వస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, మండల కార్యదర్శి స్వామి,సహాయ కార్యదర్శులు హరినాథరావు రాములు యువజన సంఘం నాయకులు కీర్తి ప్రవీణ్ మరియు ఇమామ్ జంబులు పాల్గొన్నారు

# బండలేమూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మార్నింగ్ వాక్ కార్యక్రమం

**మంచాల వెలుతురు జులై 27:**

మంచాల మండలం బండలేమూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మార్నింగ్ కార్యక్రమం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్ ఫారంలోని వివరాలను ఇవ్వని ప్రతి ఓటరు దగ్గరికి ప్రతిఇంటికి బిఎల్ ఓలతో కలిసి వారికి అవగాహన కల్పించడం జరిగింది సమయం తక్కువ ఉండడంతో ఈకార్యక్రమం నిర్వహించారు ఒక్కఓటు కోల్పోయిన ఆ ఓటరు వారి భవిష్యత్తు కోల్పోయినట్టే కాబట్టి అలాంటి అవకతవకలు జరగకుండా ఉండడానికి ఈ కా ర్యక్రమం చేయడం జరిగింది ఫారం నింపని ప్రతి ఓటరు దగ్గరికి వెళ్లి స్వయంగా తామే ఫారం నింపి బిఎల్ ఓ గారికిఇవ్వడం జరిగింది ఈకార్యక్రమం వలన ప్రతి ఓటరు తమఓటు హక్కును కోల్పోకుండా ఉండడంతో పాటు ఫారం ఎలా నింపాలి అని అనుకునే ఓటరుకు కూడా ఈ కా ర్యక్రమం ఎంతో ఉపయోగ పడింది ఈ మార్నింగ్ వాక్ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ని ర్వహించారు ఈకార్యక్రమంలో డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్ ఓటర్లతో స్వయంగా మాట్లాడి ఓటరుకు అవగాహన కల్పించారు ఇంటింటికి తిరిగి తమ ఫారాలను నింపి బిఎల్ఓ గారికిఅం దించినందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారుఈ కార్యక్రమంలో గ్రామ కాం గ్రెస్ పార్టీ అధ్యక్షులు ముత్యాల ఐలయ్య గ్రామ కాంగ్రెస్ సర్పంచ్ కంటెస్టెంట్ అభ్యర్థి జనార్దన్ 1వవార్డ్ సభ్యురాలు శిరీష చందు 2వ వార్డ్ సభ్యుడు లొంగారి మల్లేష్ మాజీ విద్యాకమిటీ చై ర్మన్ మునిరాజ్ కాంగ్రెస్ పార్టీ ఏడవ వార్డు నెంబర్ కంటెస్టెంట్ అభ్యర్థి లక్ష్మణ్ నాయక్ ఎస్సీసెల్ కాంగ్రెస్ నాయకులు కొంకాని మురళి,ఎస్టీ సెల్ కాంగ్రెస్ యువ నాయకుడు ఆంగోత్ రవి కుమార్ కాంగ్రెస్ నాయకులు జక్కలి సత్తయ్య కాంగ్రెస్ మాజీ విద్యకమిటీ చైర్మన్ రేఖ్యానాయక్ కాంగ్రెస్ పార్టీ నాల్గవ వార్డు కంటెస్టెంట్ అభ్యర్థి రమేష్ నాయక్ కాంగ్రెస్ పార్టీ వార్డు నెంబర్ కంటెస్టెంట్ అభ్యర్థి రమావత్ మంజుల రమేష్ ఎస్.కె ఇబ్రహీంత



దితరులు పాల్గొన్నారు.

# ఆరుట్ల గ్రామంలో వర్షాలు కుర వాలని కప్ప కాముడు ఊరేగింపు చేసిన మహిళలు

- **కప్పకాముడు ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్**

**మంచాల వెలుతురు జూలై 27:**



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో వానలు బాగా కురవాలని ఆదేవుడిని వేడుకుంటూ కప్ప కాముడు ఊరేగింపు చేసిన మహిళలు మహిళలు కప్పకాముడుకు పూజలు చేసిన ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ ఈసందర్భంగా మాట్లాడుతూ సమయానికి వర్షాలు రా క అల్లాడుతున్న రైతంగం పశువులకు గొర్రకు మేకలకు మేతలేక భూమి ఎంత ఎండిపోయి కని పిస్తుంది వర్షాలు రాకపోవడం మూలంగాకూలీలకు పనిలేక రైతులు అనేక ఇబ్బందులు పడు తున్నారు వానదేవుని కోసం మొరపెట్టుకున్న వర్షపాతం లేకపోవడం మూలంగా మంచాల మం డలాన్ని కరువుమండలంగా ప్రకటించి కరువు సహకార చర్యలు చేపట్టాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరుతున్నాం అనిఅన్నారు వరుణదేవుడు ఇప్పటికైనా కరుణించి వర్షం పడాలని ప్రార్థిస్తున్నాం శివాలయంలో యజ్ఞంచేసి శివుని ఆరుట్ల గ్రామప్రజలంతా బిందెలతో నీళ్లు పోసిశివుని పూజిం చడం జరిగింది వరుణ దేవా ఇకనైనా కరుణించు దేవా అనివరుణ దేవుడుని కోరుకున్నారు ఈ కార్యక్రమంలో ప్రజాగళం దామర భూపాల్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మల్ అభిషేక్ రెడ్డి

**మంచాల వెలుతురు జులై 27:**

మంచాల మండలం ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించిన ఇబ్రహీంపట్నం ఎమ్మె ల్యేమల్ రంగారెడ్డి తనయుడు కాంగ్రెస్ పార్టీ రాష్టనాయకుడు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి ముందు గా ఆరుట్ల గ్రామానికి విచ్చేసిన మల్ రెడ్డి అభిషేక్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ అధ్య క్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్ ప్రధానకార్యదర్శి చిందం శ్రీశైలం ఆధ్వర్యంలో రాష్ట్ర నాయ కుడు కొంగరవిష్ణువర్ధన్ రెడ్డితో కలిసి అభిషేక్ రెడ్డిని శాలువాతో సన్మానించారు అనంతరంపాఠ శాలలో తరగతి గదులు క్రీడామైదానాలు డైనింగ్ హాల్ కిచెన్ లైబ్రరీ గదులను పరిశీలించారు తెలంగాణ పబ్లిక్ పాఠశాల ప్రధానఉపాధ్యాయుడు సిద్ధగోని



గిరిధర్ గౌడ్ తో కలిసి మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇ బ్బందులు లేకుండా చూడాలని పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉ న్నఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకురావాలని అని అన్నారుఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మా ర్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ మంచాల సొసైటీ డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్ గ్రామపం చాయతీ వార్డు సభ్యుడు మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ మంచాల మండలం యూత్ కాంగ్రెస్ అధ్య క్షుడు రావుల రాఘవ ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నరసింహగౌడ్ కంబాలపల్లి బుగ్గరా ములు మారలక్ష్మణ్ కోరే బాబు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావుల భాష గుడ్డిమల్లచం ద్రయ్య ముదిరాజ్ మర సురేష్ చిందం ఐలయ్య వస్పరి కుమార్ లచ్చిరాంనాయక్ మైనార్టీ నా యకుడు మహమ్మద్ అష్రఫ్ యూత్ కాంగ్రెస్ ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్షుడు బుడిగల పరమేష్ పంబాల కిషోర్ గొరిగే కృష్ణ ఆడెపుమధు తదితరులు పాల్గొన్నారు.

# కొండకల్, మోకిలా గ్రామసభల్లో 'జలసిరి' అవగాహన

- **ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టాలి**
- **ఎంపీడీవో ప్రవీణ్ కుమార్**

**శంకర్ పల్లి, వెలుతురు జులై 27 :**






ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'జలసిరి' కార్యక్రమంలో భాగంగా సోమవారం కొండకల్, మోకిలా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల గౌరవ సర్పంచుల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో ముఖ్య అతిథిగా ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. భూగర్భ జలాల పెంపు, నీటి సంరక్షణ కొరకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టవలసిన పనుల గురించి గ్రామస్థులకు వివరంగా తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. వర్షపు నీరు వృథాగా పోకుండా ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకోసం గ్రామాల్లో కింది పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. వృథా నీటిని భూమిలోకి మళ్లించేందుకు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతను నిర్మించుకోవాలి. ప్రతి పంట పొలానికి ఒక వ్యవసాయ విలేజ్ లేదా ఫామ్ పాండ్ (పంట కుంట) ఏర్పాటు చేయాలి. వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలమట్టం పెంచేందుకు ప్రతి గ్రామంలో ఒక పర్కోలేషన్ ట్యాంక్ (ఊట చెరువు) నిర్మించాలి. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం వల్ల వాతావరణంలో తీవ్ర మార్పులు సంభవిస్తున్నాయని హెచ్చరించారు. రైతులు సాంప్రదాయ వరి పంటపైనే పూర్తి ఆధారం పడకుండా, తక్కువ నీటితో పండే ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు. ఈ నీటి సంరక్షణ ఉద్యమంలో గ్రామీణులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల గౌరవ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వనస్థలిపురంలో "రాజావారి క్వేక్ ఫిట్‌నెస్ అరేనా" ఘనంగా ప్రారంభం






**ఎల్బీనగర్, వెలుతురు జూలై 27:**

యువతలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో వనస్థలిపురంలోని విష్ణు థియేటర్, రాఘవేంద్ర టిఫిన్ సెంటర్ సమీపంలోని పై షోరూమ్ భవనం మూడో అంతస్తులో ఏర్పాటు చేసిన "రాజావారి క్వేక్ ఫిట్‌నెస్ అరేనా" జిమ్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మధు యాష్కి గౌడ్ హాజరై దీపప్రజ్వలన చేసి, అనంతరం రిబ్బన్ కట్ చేసి జిమ్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, బీజేపీ నాయకులు కుంట్లూరు వెంకటేష్ గౌడ్, టీడీపీ నాయకులు గద్దె విజయ్ నేతతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొని జిమ్ నిర్వాహకులు రాజా, సందీప్, కశ్యప్, రాకేష్లను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

జిమ్‌లో అందుబాటులో ఉన్న సదుపాయాలు:

- అత్యాధునిక ఫిట్‌నెస్ పరికరాలు
- అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్ ట్రైనర్లు
- కార్డియో శిక్షణ
- వెయిట్ ట్రైనింగ్
- వ్యక్తిగత శిక్షణ (పర్సనల్ ట్రైనింగ్)

అందరికీ అందుబాటు ధరల్లో నాణ్యమైన ఫిట్‌నెస్ సేవలను అందించడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. యువత ఆరోగ్యంగా, దృఢంగా ఉండేందుకు ఈ జిమ్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక ప్రముఖులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

**శంకర్‌పల్లి, వెలుతురు జూలై 27 :**



ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా

ఆగస్టు 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నా పోస్టర్‌ను శంకర్‌పల్లి మండలంలోని సత్య అకాడమీలో నిర్వహిస్తున్న మూడు రోజుల ఎస్‌జీటీ శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల విద్యాధికారి రవీందర్ రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎంఈఓ రవీందర్ రావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు నిరంతరం వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు విద్యా వ్యవస్థ అభివృద్ధికి తమ వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు.అనంతరం తపస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన ఎన్నో సమస్యలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఆరు డీఏల విడుదల, పీఆర్సీ అమలు, సీపీఎస్ సమస్యకు శాశ్వత పరిష్కారం, పెన్షనర్ల బకాయిల చెల్లింపు తదితర న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 1న ఇందిరా పార్క్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయడం ప్రతి ఉపాధ్యాయుడు, ఉద్యోగి బాధ్యత అని అన్నారు.ఇది ఏ ఒక్క సంఘానికి సంబంధించిన కార్యక్రమం కాదని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లందరి హక్కుల సాధన కోసం చేపడుతున్న ఉమ్మడి ఉద్యమమని పేర్కొన్నారు. సంఘాలకు అతీతంగా ప్రతి ఉద్యోగి, ప్రతి ఉపాధ్యాయుడు భారీ సంఖ్యలో మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బసవరాజు, సంఘ సభ్యులు జంగయ్య, కృష్ణ, శ్రీనివాస్, వెంకటేష్, భక్తప్ప, నందు, రాజేందర్ తదితరులు, అలాగే ఎస్‌జీటీ శిక్షణలో పాల్గొంటున్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హయత్‌నగర్‌లో ఘనంగా ప్రారంభమైన "ది క్యాష్యూ బేకర్స్" బేకరీ & ఫుడ్ కోర్ట్

**హయత్‌నగర్, వెలుతురు జూలై 27:**



హయత్‌నగర్‌లోని సన్‌రైజ్ హాస్పిటల్ ఎదురుగా నూతనంగా "ది క్యాష్యూ బేకర్స్" బేకరీ & ఫుడ్ కోర్ట్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. యువతతో పాటు కుటుంబ సభ్యులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ సంస్థను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.సంస్థ నిర్వాహకుడు ఎం.డి. జానీ పాషా మాట్లాడుతూ, కేక్స్, పేస్ట్రీస్, పిజ్జాలు, బర్గర్లు, చైనీస్ వంటకాలు, చాట్, జ్యూస్‌లు, ఐస్‌క్రీమ్‌లు తదితర అనేక రకాల ఆహార పదార్థాలు ఒకే చోట అందుబాటులో ఉంటాయని తెలిపారు.బేకరీ విత్ లవ్ అనే నినాదంతో నాణ్యత, పరిశుభ్రత, రుచికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సరసమైన ధరల్లో వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమానికి పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, వ్యాపారవేత్తలు హాజరై నిర్వాహకుడు జానీ పాషాకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బేకరీ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

సంప్రదించవలసిన నంబర్: 9553048296

# ఓటరు నమోదు ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు..

**కూకట్ పల్లి జూలై 27 వెలుతురు:**

ఆల్విన్ కాలనీ డివిజన్‌లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు (SIR) ప్రక్రియను కాంగ్రెస్ నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాంగ్రెస్ నేత జిల్లా గణేష్, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, నాయకుడు బోయ కిషన్ కలిసి బీఎల్‌వో ఇన్‌చార్జి సీఓ ముస్తఫా, సంబంధిత బీఎల్‌వోలతో సమావేశమై ఓటరు నమోదు కార్యక్రమం పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా గణేష్ మాట్లాడుతూ, అధికారులు, బీఎల్‌వోలు, కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు సమన్వయంతో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలిసి వారి వివరాలను ధృవీకరించాలని సూచించినట్లు తెలిపారు. కాలనీ అధ్యక్షులతో సమన్వయం చేసుకుంటూ, ఇతర ప్రాంతాలకు మారిన (షిఫ్టెడ్) ఓటర్ల వివరాలను గుర్తించి, వారి బంధువుల ద్వారా సమాచారం సేకరించాలని సూచించారు. ప్రస్తుతం ఆల్విన్ కాలనీ డివిజన్‌లో షిఫ్టెడ్ ఓటర్ల సంఖ్య అధికంగా ఉందని పేర్కొన్న ఆయన, అటువంటి ఓటర్లకు ఓటరు నమోదు, మార్పులు చేయించుకోకపోతే భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని అవగాహన కల్పించాలని అన్నారు. అవసరమైతే అలాంటి ఓటర్ల వివరాలను కాంగ్రెస్ పార్టీకి అందజేస్తే, వారిని సంప్రదించి ప్రక్రియ పూర్తి చేయడానికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ప్రత్యేక ఓటరు నమోదు సవరణ (SIR) ప్రక్రియను వంద శాతం విజయవంతం చేయడానికి ప్రజలు, ఓటర్లు, అధికారులు



సమిష్టిగా సహకరించాలని జిల్లా గణేష్ పిలుపునిచ్చారు

# ఏవీఎం హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 27:**

మండల కేంద్రానికి చెందిన ఏవీఎం హై స్కూల్ కు చెందిన 1999-2000 కు చెందిన పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు అందరు కలిసి సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనాన్ని అమృతవనం లో నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హై స్కూల్ కరస్పాండెంట్ స్వర్గీయ నాగేందర్ సతీమణి వీరమణి టీచర్ హాజరు అయినారు. ఈ సందర్భంగా స్నేహితులందరూ తమ చిన్ననాటి జ్ఞాపకాలను, తమకు విద్యాబుద్ధులు నేర్పిన టీచర్స్,ని జ్ఞాపకం చేసుకున్నారు. స్నేహితులందరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని వారి వారి వృత్తి వ్యాపారాలు వారి పిల్లల చదువులను తెలుసుకొని చాలా సంతోషపడ్డారు. ఈ సందర్భంగా స్నేహితులందరూ కలిసి వీరమణి మేడం కు సన్మానం చేసినారు. ఈ కార్యక్రమంలో మిర్యాల. మల్లేష్, లవణం రవి, మోటే నరసింహ,కాడే రాజేందర్, ఆకవరపు భాను,ఈతపుల ఉదయ్, లగ్గొని మహేష్,శ్రావణి, స్వప్న, సరస్వతి, విజయలక్ష్మి , బండ లింగస్వామి, ప్రవీణ్, కొండ మల్లేష్, పురుషోత్తం రెడ్డి, ఐలమ్మ, అరుణ, చక్రపాణి, నదీమ్,గోరిగే రవి, రావిటి పరమేష్, అంబంటి రవి,లావణ్య, రజిత, రేణుక, రజిని తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు తక్షణమే గుర్తింపు కార్డులు ఇవ్వాలి

- **గంధ మల్ల బాలయ్య తెలంగాణ ఉద్యమకారుల ఫోరం యాదాద్రి జిల్లా అధ్యక్షులు**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 27:**



మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం సమావేశంలో డాక్టర్ చీమ శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తెలంగాణ ఉద్యమ కారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని. రాష్ట్ర ప్రభుత్వం కేకే కమిటీ వేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ కమిటీ పేరుతో కాలయాపన కాకుండా మండల వ్యాప్తంగా ప్రతి గ్రామ గ్రామంలో తెలంగాణ కోసం ఉద్యమం చేసిన నిజమైన ఉద్య మకారులకు గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని. ఉద్యమకారుల యొక్క న్యాయపరమైన హక్కులను నెరవే ర్చాలని. ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలంతో పాటు 25 వేల రూపాయల పింఛన్ ఇవ్వాలని వారికి హెల్త్ కార్డు సౌకర్యం కల్పించాలని ఉద్యమంలో పాల్గొని కేసులు అయిన వారి తో పాటు బైండోరాయ్ ఉద్యమంలో పనిచేసిన ప్రతి ఉద్యమకారుని కేకే కమిటీ వారి ప్రతినిధులతో రాష్ట్ర వ్యాప్తంగా వారిని గుర్తించి న్యాయం చేయాలని అమరులైన కుటుంబాలకు న్యాయం చేయాలని జిల్లా అధ్యక్షులు గంధ మల్ల బాలయ్య తెలిపినారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక విభాగం కళాకారుల సంఘం జిల్లా కన్వీనర్ గంధ మల్ల వెంకటేశం ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకులు రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షులు రెబ్బాసు. రాములు ఉద్యమ నాయకులు టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం యాదగిరి సిపిఐ మండల మాజీ సెక్రటరీ రామన్నపేట మాజీ ఉపసర్పంచ్ గంగాపురం యాదయ్య ఉద్యమ నాయకులు స్థానికం చీఫ్ ఎడిటర్ కొండ మల్లేష్ రామన్నపేట మండలాధ్యక్షులు నోముల శంకర్ ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య మాజీ ఉపాధ్యక్షులు మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఎండి ఇమామ్ మద్దెగల్ల, నరసింహ. ఉద్యమ నాయకులు మన ప్రగతి రిపోర్టర్ కైరం కొండ సంతోష్ ఉద్యమ నాయకులు ఎర్ర రమేష్ గౌడ్ ఉద్యమ నాయకులు పెండం రవీందర్ ఉద్యమ నాయకులు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# నల్ల పాపయ్య మృతుదేహానికి నివాళులర్పించిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 27:**

గ్రామం ఇంద్రపాలనగరం అకాల మరణం చెందిన నల్ల పాపయ్య గారి మృతుదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి,మాజీ ఏఎంసి డైరెక్టర్ మందడి విద్యాసాగర్ రెడ్డి, యువనాయకులు సింగణబోయిన గణేష్ యాదవ్, రాస వెంకటేష్, చేనేత సహకార సంఘము చైర్మన్ రవ్వ నర్సింహ,మాజీ ఉపసర్పంచ్ సింగణబోయిన జంగయ్య యాదవ్,నక్క వెంకటేష్,రాజన్న మురళి,నల్ల శంకరయ్య,కొమ్మగోని సంజీవ,మాధం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని మెట్ట వర్షాధార పంటలు సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

- **వ్యవసాయ అధికారి ఎజాజ్ అలీ ఖాన్**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 27:**



ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని మెట్ట (వర్షాధార) పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి ఎజాజ్ అలీఖాన్ తెలియజేశారు.సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విత్తనమేల కార్యక్రమాన్ని పిఎసిఎస్ చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి మరియు రామన్నపేట ఉప సర్పంచ్ మోటె రమేష్ తో కలిసి ప్రారంభించారు.రైతులు అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా స్థానిక పరిస్థితులకు అనుకూలమైన వర్షాధార పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చు.రైతుల సౌకర్యార్థం అవసరమైన మెట్ట పంటల విత్తనాలను సంబంధిత రైతు వేదికలలో,అందుబాటులో ఉంచడం జరిగింది. చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వలన రైతులు స్వల్పకాలికంగా పండే కందులు, మినుములు కూరగాయలకు చేయాలని,సూచించారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, సకాలంలో విత్తనాలను పొందడంతో పాటు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పంటల సాగు చేపట్టాలని కోరుతున్నాము. అ ధిక సమాచారం కోసం సమీప వ్యవసాయ అధికారి లేదా రైతు వేదికను సంప్రదించగలరు. ఈ కార్యక్రమంలో జమీరుద్దీన్, వనం చంద్రశేఖర్, నాసర్, నోముల ప్రవీణ్ కుమార్, రైతులు ఉప్పలయ్య, యాదాసు రాములు, యాదమ్మ, సరిత నరసింహ వ్యవసాయ విస్తరణ అధికారులు ఎం. శ్రీనివాస్, పి.శ్రీనివాస్, వి.కీర్తన,ఈ.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నీనో ప్రభావంజలసిరి పెంపుపై రేపు మండల స్థాయి అవగాహన: ఎంపీడీవో సునీత

**నూతనకల్ జూలై 27(వెలుతురు )**



మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎల్ నీనో ప్రభావం- జలసిరి వర్క్ పై అధికారులకు సర్పంచ్ లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించ నున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సునీత వివరిస్తూ జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల ప్రకారం మంగళవారం మండల ప్రత్యేక అధికారి ఎంఏ భారతి అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావే శానికి అందరూ మండల స్థాయి అధికారులు, సర్పంచ్ లు, ఏఈ పంచాయతీరాజ్, ఏఈ ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులు, వివిజి రాంజీ సిబ్బంది తదితరులు హాజరుకావాలని వారు తెలిపారు.

# ఇందిరమ్మ ఇల్లు పేదవాడికి వరం: అనంత చంద్రశేఖర్ గౌడ్


**చండూరు వెలుతురు జూలై 27:**



సోమవారం రోజున చండూరు మున్సిపాలిటీ ఐదో వార్డ్ అంగడిపేట గ్రామంలో భూతరాజు శ్రీనివాసులు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకొని గృహప్రవేశానికి ఇచ్చిన సందర్భంగా వారితో గృహప్రవేశం చేయించడం జరిగింది శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి సహకారంతో మునుగోడు నియోజకవర్గం చండూరు మున్సిపాలిటీ అంగడిపేట గ్రామంలోని ఐదో వార్డులో ఇంద్రమ్మ ఇల్లు నూతన గృహప్రవేశం చేసిన కుటుంబ సభ్యులు ఎంతో ఆనందం వ్యక్తం చేయడం జరిగింది. ఇందిరమ్మ ఇల్లు పేదవాడి వరంగా వారి కళ్ళల్లో ఆనందం వ్యక్తం చేశారు ప్రతి ఒక్కరూ అర్హులైన వారు లబ్ధి పొందాల్సిందిగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వడం జరుగుతుంది కాబట్టి ప్రతి ఒక్కరు ఈ విషయాన్ని గమనించి అర్హులైన ప్రతిఒక్కరికి లబ్ధి పొందేవిధంగా స్థానిక నాయకులు చొరవ తీసుకోవాలని అనంత చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్లగంటి మల్లేశం,చేడల్ల వెంకన్న , కుటుంబసభ్యులు పాల్గొన్నారు

# ఉస్మానియా విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్రం హెడ్ కు శుభాకాంక్షలు తెలియజేసిన డాక్టర్ ఎన్ అశోక్

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 27:**



ఉస్మానియా విశ్వవిద్యా లయం రాజనీతి శాస్త్ర విభాగనీ కి హెడ్ గా బాధ్యతలు తీసుకున్న ప్రొఫెసర్ శ్రీలత మేడంకు పూల మొక్క ను అందించి శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వాదం తీసుకు న్న డాక్టర్ ఎం. అశోక్ ఈ కార్యక్రమంలో దివ్యాంగుల విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్. రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కురిషిద్ మియా, డాక్టర్ వెంకటేశం కల్తి, ఎర్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రాపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు: బీఆర్ఎస్

- **హైడ్రా కమిషనర్ రంగనాథ్ తొలగింపు ఆదేశాలపై హర్షం వ్యక్తం చేసిన బీఆర్ఎస్**
- **పేదల ఇళ్లను కూల్చడానికే హైడ్రాను ఉపయోగించారని ఆరోపించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**
- **తిరిగి అధికారంలోకి రాగానే మొదటి రోజే 'హైడ్రా' రద్దు: బీఆర్ఎస్ హెచ్చరిక**

**హైదరాబాద్, వెలుతురు జూలై 27:**



హైడ్రా కమిషనర్‌ను తక్షణమే తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను బీఆర్ఎస్ పార్టీ స్వాగతించింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఈ తీర్పు చెంపపెట్టు లాంటిదని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అభివర్ణించారు.

సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జివో 99 ద్వారా తీసుకొచ్చిన 'హైడ్రా' వ్యవస్థ పేదల ఇళ్లను లక్ష్యంగా చేసుకోవడానికి ఒక సాధనంగా మారిందని విమర్శించారు. హైడ్రా కమిషనర్‌పై 63 కోర్టు ధిక్కార కేసులు నమోదవ్వడం ఆ సంస్థ పనితీరుకు, చట్ట ఉల్లంఘనలకు నిదర్శనమని అన్నారు. ఈ ఏజెన్సీ తీరుపై హైకోర్టు చేసిన తీవ్ర వ్యాఖ్యలు ప్రస్తుత పాలనలోని లోపాలను ఎత్తిచూపుతున్నాయని పేర్కొన్నారు.

పేదలకు ఒక న్యాయం, ముఖ్యమంత్రి బంధువులకు మరో న్యాయమా? అని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసమే హైడ్రాను ఉపయోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. అధికారులు చట్టపరిమితులకు లోబడి మాత్రమే పనిచేయాలని, కేవలం కమిషనర్‌ను మార్చినంత మాత్రాన సరిపోదని, ప్రభుత్వ ఆలోచనా విధానం మారకపోతే సంస్థ పనితీరు మారదని స్పష్టం చేశారు.

గతంలో బీఆర్ఎస్ అధినేత, పూర్వ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇచ్చిన హామీని ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ పునరుద్ఘాటించారు. తాము మళ్లీ అధికారంలోకి వచ్చిన మొదటి రోజే 'హైడ్రా'ను పూర్తిగా రద్దు చేస్తామని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చాక హైడ్రా నిర్వహించిన ప్రతి ఫైలును సమగ్రంగా పరిశీలిస్తామని, చట్టవిరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# 524 గ్రామాల కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు నియామకం

- **రామన్నపేట యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బట్టే సంతోష్ కుమార్**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 27:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ఆదేశానుసారం తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి, నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షులు ఏనుగు రఘుమా రెడ్డి సహకారంతో రామన్నపేట మండల యువజన కాంగ్రెస్ 24 గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులను మరియు కార్యవర్గ సభ్యులను నియమించినట్లు రామన్నపేట యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బట్టె సంతోష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బట్టె సంతోష్ కుమార్ మాట్లాడుతూ నూతన గ్రామ అధ్యక్షులకు మరియు కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, కార్యకర్తలను సమన్వయం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. నూతన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందుతుంది అని నమ్ముతున్నానని అన్నారు. కొత్తగా నియమింపబడ్డ నాయకులకు విజయవంతమైన పదవీకాలం ఉండాలని కోరారు.

# 19వ డివిజన్ రేకుర్తిలో రూ. 15వ ఆర్థిక సంఘం నిధులతో మంచినీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన



- ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం
- నగర మేయర్ కొలగాని శ్రీనివాస్*

**కరీంనగర్ వెలుతురు జూలై 27:**

కరీంనగర్ నగర ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాలను కల్పించే దిశగా నగరపాలక సంస్థ మరో కీలక అడుగు వేసింది. నగరపాలక సంస్థ 19వ డివిజన్ రేకుర్తి ప్రాంతంలో 15వ ఆర్థిక సంఘం (15th Finance Commission) నిధులతో చేపట్టనున్న మంచినీటి పైపులైన్ పనులకు కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ గారితో కలిసి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, వేగంగా విస్తరిస్తున్న నగర అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన తాగునీటిని ప్రతి ఇంటికి అందించేందుకు నగరపాలక సంస్థ పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైపులైన్లు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు గారు, స్థానిక కార్పొరేటర్ సుదగోని మాధవి కృష్ణ గారు, కార్పొరేటర్లు పర్వతం మల్లేశం గారు, గుగ్గిళ్ల జయశ్రీ గారు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# SIR ఎన్యుమరేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి





- అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధుల సహకారం కోరిన అధికారులు...

**జహీరాబాద్ వెలుతురు జూలై 27:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్, జహీరాబాద్ తహసీల్దార్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మహమ్మద్ యూనుస్, వైస్ చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్లు, అన్ని రాజకీయ పార్టీల పట్టణ అధ్యక్షులతో కలిసి SIR ఎన్యుమరేషన్ ఫారాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు SIR ఎన్యుమరేషన్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఎన్యుమరేషన్ ఫారాలు చేరేలా చూడడంతో పాటు, నిర్ణీత గడువులోగా వాటిని సేకరించి సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తూ వార్డు కౌన్సిలర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఫీల్డ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు.ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కమిషనర్ జి. ప్రభాకర్ ఆదేశించారు.

# మార్కండేయ ఆలయంలో గోరింటాకు పండగ





**వెలుతురు నారాయణఖేడ్ జూలై 27 :**

సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌరస్తా వద్ద గల శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో ఆషాడ మాస సందర్భంగా గోరింటాకు పండుగను పద్మశాలి మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. మహిళలందరూ కలిసి ఉదయాన్నే గోరింటాకును తీసుకువచ్చి ఆలయ ప్రాంగణంలో రోలు రోకలితో సాంప్రదాయ పాటలు పాడుతూ గోరింటాకు తయారు చేశారు. అనంతరం ఒకరి అరచేతులకు ఒకరు గోరింటాకు పెట్టుకున్నారు. గోరింటాకు పండగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆచార సాంప్రదాయాలను కొనసాగించే నూతన ఒరవడితో భక్తి మార్గంలో శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో చక్కని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా ఆషాడమాసంలో శరీర వేడి ఎక్కువ చేస్తుంది కాబట్టి గోరింటాకు పెట్టుకోవడం వల్ల కాస్త ఉపశమనం కలుగుతుందన్నారు.పద్మశాలి మహిళా విభాగం సభ్యులు చక్కని కార్యక్రమం నిర్వహించారని అభినందించారు. అనంతరం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సతీమణి అనుపమ రెడ్డికి శాలువాతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో భక్తులు మహిళలు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలపై బిజెపి సమరభేరి

- ఖేడ్‌లో ఫీజుల బకాయి - బిజెపి లాడాయి పోస్టర్ ఆవిష్కరణ

**వెలుతురు నారాయణఖేడ్ జూలై 27 :**





సంగారెడ్డి జిల్లా :- రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 15,000 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నారాయణఖేడ్ పట్టణంలో "ఫీజుల బకాయి – బిజెపి లాడాయి" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం నాడు ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కోణం విఠల్, నారాయణఖేడ్ మండల అధ్యక్షులు సిందోల్ దశరథ్, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్ సాయి, మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడ్డ నిధులను విడుదల చేయకుండా దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు మరియు జీవితాలతో చెలగాటమాడుతోందని తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై బిజెపి రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండే ఇచ్చిన పిలుపు మేరకు, పెండింగ్ ఫీజుల సాధనకై వచ్చే నెల 17, 18 తేదీలలో ఎమ్మెల్యేల ఇండ్ల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మండలాల వారీగా పలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో శంకరంపేట్ మండల అధ్యక్షులు శ్రావణ్, నాయకులు సాగుణాకర్, కృష్ణ మరియు పార్టీ ముఖ్య కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# మత్తు రహిత యువతతోనే వికసిత్ భారత్ సాధ్యం – నగర మేయర్ కొలగాని శ్రీనివాస్







- వాగేశ్వరి కళాశాలలో ఘనంగా "నశా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్" కార్యక్రమం

**కరీంనగర్ వెలుతురు జూలై 27:**

మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్య, నైపుణ్యం, క్రమశిక్షణ, దేశభక్తితో ముందుకు సాగే యువతే వికసిత్ భారత నిర్మాణానికి బలమైన పునాది అవుతుందని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన "నశా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్" అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, యువత తమ జీవిత లక్ష్యాల సాధనలో ఎలాంటి పరిస్థితుల్లోనూ మాదకద్రవ్యాల వైపు ఆకర్షితులు కాకూడదని సూచించారు. దేశ అభివృద్ధికి యువశక్తే ప్రధాన బలమని, యువత సక్రమ దిశలో పయనిస్తేనే భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానానికి చేరుకుంటుందని అన్నారు.తాను కేవలం నగర మేయర్‌గా మాత్రమే కాకుండా ఒకప్పుడు నెహ్రూ యువ కేంద్ర (NYK) వాలంటీర్‌గా గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న యువకుడినని గుర్తు చేసుకున్నారు. సమాజానికి నిస్వార్థంగా సేవ చేసిన వారిని ప్రజలు ఎప్పటికైనా గుర్తించి గౌరవిస్తారని, అదే తన ప్రజా జీవితానికి పునాదిగా నిలిచిందని తెలిపారు.ప్రజల ఆశీర్వాదంతో చిన్న వయసులోనే కరీంనగర్ నగర మేయర్‌గా సేవ చేసే అవకాశం లభించడం తన వ్యక్తిగత విజయం కాదని, యువతపై ప్రజలు ఉంచిన విశ్వాసానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి యువకుడు సమాజం కోసం ఆలోచిస్తూ ముందుకు సాగితే నాయకత్వ అవకాశాలు సహజంగానే వస్తాయని అన్నారు.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రతిపాదించిన "వికసిత్ భారత్ @2047" లక్ష్య సాధనలో యువత పాత్ర అత్యంత కీలకమని మేయర్ పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలంటే విద్యతో పాటు నైపుణ్యం, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవన విధానం, సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు, దేశభక్తి వంటి విలువలను ప్రతి యువకుడు అలవరచుకోవాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "నశా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్" ఉద్యమం యువతను మాదకద్రవ్యాల వ్యసనానికి దూరంగా ఉంచి, వారి శక్తి, ప్రతిభ, సామర్థ్యాలను దేశ నిర్మాణంలో వినియోగించేందుకు ప్రారంభించిన మహత్తర కార్యక్రమమని వివరించారు.భారత అంతరిక్ష రంగంలో యువత సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ స్కైరూట్ ఏరోస్పేస్ యువ ఇంజినీర్ల ప్రస్థానాన్ని ఉదాహరణగా చెప్పారు. చిన్న కలతో ప్రారంభమైన వారి ప్రయాణం నేడు భారతదేశానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చిందని, లక్ష్యంపై నమ్మకం, కష్టపడి పనిచేసే తత్వం, దేశంపై ప్రేమ ఉంటే ఏ యువకుడైనా అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలడని పేర్కొన్నారు.నేటి కళాశాల విద్యార్థుల్లోనే రేపటి శాస్త్రవేత్తలు, వైద్యులు, ఇంజినీర్లు, ఐఏఎస్ అధికారులు, పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారని అన్నారు. ఒక తప్పు అలవాటు జీవితాన్ని నాశనం చేస్తుందని, కానీ ఒక మంచి లక్ష్యం జీవితాన్ని మాత్రమే కాదు దేశ భవిష్యత్తును కూడా మార్చగలదని చెప్పారు.విద్యార్థులు తమ జీవితాన్ని మత్తుకు కాకుండా విజ్ఞానానికి, ఆవిష్కరణలకు, పరిశోధనలకు అంకితం చేయాలని పిలుపునిస్తూ, "మత్తుకు దూరంగా ఉండండి... మీ లక్ష్యాలకు దగ్గరగా ఉండండి. సిగరెట్ కాదు... సైన్స్‌ను పట్టుకోండి. మత్తు కాదు... మేధస్సే మీ అసలైన శక్తి" అని ఉద్బోధించారు.కార్యక్రమంలో నిర్వహించిన డాన్స్, సంగీతం, నుక్కడ్ నాటక్, డిబేట్, పెయింటింగ్, రీల్ మేకింగ్, స్లోగన్ రైటింగ్, స్లామ్ పోయెట్రీ వంటి పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు మత్తు పదార్థాల దుష్పరిణామాలపై సమాజంలో చైతన్యం తీసుకువచ్చే వేదికలుగా నిలుస్తాయని కొనియాడారు.ప్రతి విద్యార్థి తన తల్లిదండ్రులకు గర్వకారణంగా, సమాజానికి ఆదర్శంగా, దేశ అభివృద్ధికి తోడ్పడే బాధ్యతాయుత పౌరుడిగా ఎదగాలని ఆకాంక్షించిన మేయర్, కరీంనగర్ నగరంలో యువత అభివృద్ధి, నైపుణ్య వికాసం, సామాజిక చైతన్యానికి సంబంధించిన ప్రతి మంచి కార్యక్రమానికి నగరపాలక సంస్థ తరపున ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.



# దేశ రక్షణలో సైనికుల త్యాగాలు అమోఘం – యువతలో దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందాలి: నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

- ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ మరియు డా. ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహణ*

**కరీంనగర్ వెలుతురు జూలై 27:**



దేశ రక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ, తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టే భారత సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని, నేటి యువత వారిని ఆదర్శంగా తీసుకుని దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావాన్ని అలవర్చుకోవాలని నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.కార్గిల్ విజయ్ దివస్ మరియు భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డా. ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో తీవ్ర ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ విధులు నిర్వర్తిస్తున్న జవాన్ల సేవలను కొనియాడారు. మైనస్ 3 నుండి మైనస్ 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల్లో, మంచు పర్వతాల మధ్య ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశ భద్రత కోసం సైనికులు చేస్తున్న సేవలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని అన్నారు.2009లో తాను శ్రీనగర్, కార్గిల్ ప్రాంతాలతో పాటు లాల్ చౌక్‌ను సందర్శించినప్పుడు సీఆర్‌పీఎఫ్ జవాన్లపై జరిగిన రాళ్ల దాడులను ప్రత్యక్షంగా చూశానని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ–కాశ్మీర్‌లో పరిస్థితులు గణనీయంగా మెరుగుపడి, అభివృద్ధి మరియు శాంతి నెలకొన్నాయని పేర్కొన్నారు.భారతదేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేయడంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, ప్రముఖ శాస్త్రవేత్త డా. ఏపీజే అబ్దుల్ కలాం చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. పోఖ్రాన్ అణు పరీక్షలతో ప్రపంచ వేదికపై భారత్ తన శక్తి సామర్థ్యాలను చాటిందని పేర్కొన్నారు. నేడు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత సైన్యం సాంకేతికంగా మరింత బలోపేతమై దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు.అలాగే, వికసిత్ భారత్–2047 లక్ష్య సాధనలో యువత పాత్ర అత్యంత కీలకమని, దేశాభివృద్ధికి ప్రతి యువకుడు బాధ్యతాయుతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమం అనంతరం దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన లయన్స్ క్లబ్ సభ్యులు, స్థానిక కార్పొరేటర్‌తో పాటు నిర్వాహకులకు మేయర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.కార్యక్రమం లో పాల్గొన్న వారంతా "భారత్ మాతా కీ జై", "వందే మాతరం" నినాదాలతో దేశభక్తిని చాటారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎన్నం లక్ష్మి ప్రకాష్, కర్రే పద్మ అనిల్, గాజా రమా శివరాం రిటైర్డ్ ఆర్మీ జవాన్లు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



## హైదరాబాద్ ప్రతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల మందులు, వ్యాక్సిన్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి

- **డా. పుట్ల శ్రీనివాస్, జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి, హైదరాబాద్**



**హైదరాబాద్ వెలుతురు జూలై 27:**

హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఈరోజు జిల్లా పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (UPHCs) ఫార్మసీ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి వైద్యుల ప్రిస్క్రిప్షన్ ప్రకారం అవసరమైన మందులు ఎటువంటి ఇబ్బంది లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఫార్మసీ ఆఫీసర్లు సేవాభావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. మందుల కొరత తలెత్తకుండా స్టాక్‌ను నిరంతరం పరిశీలిస్తూ, అవసరమైన మందులను సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి సకాలంలో తెప్పించుకొని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని తెలిపారు. ముఖ్యంగా అత్యవసర మందులు మరియు ఎమర్జెన్సీ కిట్ ప్రతి UPHCలో తప్పనిసరిగా సిద్ధంగా ఉండాలని సూచించారు.వ్యాక్సిన్ల భద్రతకు సంబంధించిన కోల్డ్ చైన్ వ్యవస్థ అత్యంత కీలకమని పేర్కొంటూ, ILR మరియు డీప్ ఫ్రీజర్ ఉష్ణోగ్రతలను ప్రతిరోజూ పరిశీలించి రిజిస్టర్లలో నమోదు చేయాలని, వ్యాక్సిన్ల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకూడదని ఆదేశించారు. వ్యాక్సిన్ల కొరత లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఫార్మసీ స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వర్డ్–ఔట్‌వర్డ్ రికార్డులు, ఉష్ణోగ్రత రిజిస్టర్లు తదితర అన్ని రికార్డులను ప్రతిరోజూ నవీకరించాలని తెలిపారు. FEFO (First Expiry First Out) విధానాన్ని పాటిస్తూ గడువు ముగియడానికి దగ్గరలో ఉన్న మందులను ముందుగా వినియోగించాలన్నారు.నాన్ కమ్యూనికేబుల్ వ్యాధులు (NCD) వంటి దీర్ఘకాలిక వ్యాధులకు మందుల కోసం వచ్చే లబ్ధిదారులకు ఎటువంటి అంతరాయం లేకుండా మందులు అందించాలని, అవసరమైతే వెంటనే సెంట్రల్ స్టోర్ నుంచి తెప్పించాలని సూచించారు. ఫార్మసీ ఆఫీసర్లు సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన ఔషధ సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు.ఈ సమావేశంలో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డా.అనిత,Dr. ఆశ్రితా రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్స్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్, మాస్ మీడియా అధికారి జక్కుల రాములు, ఆంజనేయులు,జిల్లా మలేరియా అధికారి , ఫార్మసీ స్టోర్ ఇన్చార్జ్ సురేష్, ఇతర అధికారులు మరియు జిల్లా పరిధిలోని అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఫార్మసీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా ప్రజావాణికి(136)ఫిర్యాదులు





**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 27:**

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (136) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ–54, ఇతర శాఖలు –82 , మొత్తం 136 దరఖస్తులు అందాయి.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి , కిరణ్మయి జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జెన్ జీ తరహాలో బీసీలంతా ఐక్యమై ఎమ్మెల్యేలు, ఎంపీలుగా గెలుపొందాలి

- **బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్**

**హైదరాబాద్, వెలుతురు జూలై 27:**



రాష్ట్రంలో జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలు రాజకీయంగా మరింత ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ పిలుపునిచ్చారు.నేటి జెన్ జీ (Gen Z) యువత సోషల్ మీడియా వేదికగా ఎలా ఐక్యంగా తమ అభిప్రాయాలను బలంగా వినిపిస్తుందో, అదే స్ఫూర్తితో బీసీలంతా కులాలు, ప్రాంతాలకు అతీతంగా ఒక్కటై రాజకీయ ప్రాతినిధ్యం సాధించేందుకు కృషి చేయాలని ఆయన అన్నారు.రాష్ట్రంలో కేవలం ఐదు శాతం జనాభా కూడా లేని వర్గాలకు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు దక్కుతుండగా, జనాభాలో అత్యధిక భాగం ఉన్న బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం లేకపోవడం చాలా దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.బీసీ యువత, మేధావులు, ఉద్యోగులు, రైతులు, విద్యార్థులు, మహిళలు అందరూ రాజకీయ చైతన్యంతో ముందుకు వచ్చి ప్రజాప్రతినిధులుగా గెలిచి నిర్ణయాత్మక స్థాయికి చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.సామాజిక న్యాయం, సమాన రాజకీయ అవకాశాలు, జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం సాధించడమే బీసీల లక్ష్యంగా ఉండాలని జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు

# SIR కు ఆగస్టు 3తో గడువు ముగింపు – ఎన్యూమరేషన్ ఫారం సమర్పించండి

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 27:**

మీ ఓటు హక్కును పరిరక్షించుకోండి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన

అత్యంత విలువైన హక్కు. ప్రభుత్వాలను ఎన్నుకోవడంలో, ప్రజల అభిప్రాయాన్ని

వ్యక్తీకరించడంలో, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఓటు హక్కు కీలక

పాత్ర పోషిస్తుంది. అలాంటి అమూల్యమైన హక్కును పరిరక్షించుకోవాలంటే ప్రతి

అర్హ పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు సక్రమంగా నమోదై ఉండేలా చూసుకోవడం

అత్యంత అవసరం.

ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర

సవరణ (Special Intensive Revision – SIR) కార్యక్రమం తుది దశకు

చేరుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని

పూర్తిగా నింపి సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (BLO)కు ఆగస్టు 3వ తేదీలోగా

తప్పనిసరిగా సమర్పించాలి. ఇది కేవలం పరిపాలనా ప్రక్రియ మాత్రమే కాకుండా

ప్రతి ఓటరు నిర్వర్తించాల్సిన పౌర బాధ్యత కూడా.

### ఎందుకు SIR?

ఎన్నికల సంఘం ప్రతి ఎన్నిక నిష్పాక్షికంగా, పారదర్శకంగా

నిర్వహించేందుకు ఓటరు జాబితాను ఎప్పటికప్పుడు నవీకరిస్తుంది. చిరునామా

మార్పులు, కుటుంబ వివరాలు, కొత్తగా అర్హత పొందిన ఓటర్లు, మరణించిన లేదా

ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను సక్రమంగా నమోదు చేయడం ద్వారా

ఖచ్చితమైన ఓటరు జాబితా సిద్ధమవుతుంది. ఈ లక్ష్యంతోనే ప్రత్యేక ఓటరు

జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

### ఎన్యూమరేషన్ ఫారం ఎందుకు సమర్పించాలి?*

ఎన్యూమరేషన్ ఫారం ద్వారా ఓటరి వివరాలను ధృవీకరించి, ఓటరు జాబితాలో సరైన

సమాచారం నమోదయ్యేలా చూస్తారు. ఈ ప్రక్రియలో ప్రజల సహకారం అత్యంత కీలకం.

ఇంటింటికీ వెళ్లి బూత్ లెవల్ అధికారులు ఫారాలను అందజేస్తున్నారు. ప్రతి

ఓటరు వాటిని పూర్తిగా నింపి వెంటనే బీఎల్‌వోకు తిరిగి అందజేయాలి.

### ఆగస్టు 3 తర్వాత ఏమవుతుంది?

ఆగస్టు 3తో ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ గడువు ముగియనుంది. గడువులోగా

ఫారం సమర్పించని వారి వివరాలు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పరిశీలనకు

గురవుతాయి. ఆ పరిశీలన అనంతరం వారి పేరు ఓటరు జాబితాలో కొనసాగకపోతే, వారు

ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. అందువల్ల ప్రతి అర్హ

ఓటరు గడువులోగా తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి.

### జిల్లాలో పురోగతి ఇంకా పెరగాల్సి ఉంది

రంగారెడ్డి జిల్లాలో ఎన్యూమరేషన్ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ ఇంకా

గణనీయ సంఖ్యలో ఫారాలు సమర్పించాల్సి ఉంది. ఇప్పటివరకు నమోదైన పురోగతి ఈ

విధంగా ఉంది.

ఇబ్రహీంపట్నం – 68.87%

ఎల్.బి. నగర్ – 50.75%

మహేశ్వరం – 53.70%

రాజేంద్రనగర్ – 55.40%

శేరిలింగంపల్లి – 53.94%

చేవెళ్ల – 77.44%

కల్వకుర్తి – 85.66%

షాద్‌నగర్ – 83.12%

జిల్లా మొత్తం పురోగతి – 60.79 శాతం మాత్రమే.

అంటే ఇంకా వేలాది మంది

ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించాల్సి ఉంది. ముఖ్యంగా పట్టణ

ప్రాంతాల్లో స్పందన మరింత పెరగాల్సిన అవసరం ఉంది.

### జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పిలుపు

జిల్లా కలెక్టర్ & జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి

మాట్లాడుతూ, ప్రతి అర్హ ఓటరు ఆగస్టు 3లోగా ఎన్యూమరేషన్ ఫారాన్ని

తప్పనిసరిగా సమర్పించాలని కోరారు. గడువులోగా ఫారం సమర్పించని వారి

వివరాలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీ



లనకు గురవుతాయని, అవసరమైన

ప్రక్రియ అనంతరం ఓటరు జాబితాలో పేరు కొనసాగకపోతే ఓటు హక్కు కోల్పోయే

అవకాశం ఉంటుందని తెలిపారు. చివరి రోజు వరకు వేచి ఉండకుండా వెంటనే

బీఎల్‌వోను సంప్రదించి ఎన్యూమరేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు.

### ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

ప్రతి కుటుంబం తమ ఇంటిలోని అర్హులందరూ ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించారో

లేదో నిర్ధారించుకోవాలి. బంధువులు, స్నేహితులు, పొరుగువారికి కూడా ఈ

విషయాన్ని తెలియజేసి గడువులోగా ఫారాలు సమర్పించేలా చైతన్యం కల్పించాలి.

ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర, పారదర్శక ఓటరు జాబితా రూపొందుతుంది.

### గుర్తుంచుకోండి...

ఎన్యూమరేషన్ ఫారం సమర్పణకు చివరి తేదీ – ఆగస్టు 3

ఫారాన్ని పూర్తిగా నింపి సంబంధిత బీఎల్‌వోకు తప్పనిసరిగా అందజేయాలి.

గడువులోగా ఫారం సమర్పించని వారి వివరాలు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు

పరిశీలించబడతాయి.

మీ ఓటు హక్కును కాపాడుకోవాలంటే వెంటనే ఎన్యూమరేషన్ ఫారం సమర్పించండి.

"మీ ఓటు... మీ హక్కు... మీ బాధ్యత. ఆగస్టు 3లోగా ఎన్యూమరేషన్ ఫారం

సమర్పించి ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కండి."

## రంగారెడ్డి జిల్లాలో మాతృ మరణాలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన అదనపు కలెక్టర్ డా. కిరణ్ మయి

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 27:**



రంగారెడ్డి జిల్లా ఐడీఓసీ, కొంగర కలాన్‌లో అదనపు జిల్లా కలెక్టర్ డా. కిరణ్ మయి అధ్యక్షతన జిల్లాలో నమోదైన మాతృ మరణాల (Maternal Deaths) పై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి (DM&HO) డా. స్వర్ణ కుమారి, జిల్లా స్థాయి ప్రోగ్రామ్ అధికారులు, ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారులు (Deputy DMHOs), సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, మాతృ మరణాలు సంభవించిన ప్రాంతాల ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డా. కిరణ్ మయి మాట్లాడుతూ, జిల్లాలో ప్రతి మాతృ మరణాన్ని అత్యంత బాధ్యతతో పరిశీలించి, వాటికి దారితీసిన కారణాలను లోతుగా విశ్లేషించాలని సూచించారు. గర్భిణులకు గర్భధారణ ప్రారంభం నుంచే నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, అధిక ప్రమాద గర్భిణులను (High Risk Pregnancies) ముందుగానే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని ఆదేశించారు.ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో మరియు ప్రసవానంతర కాలంలో అవసరమైన వైద్య సేవలు ఎటువంటి లోపం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో ఉన్నత వైద్య కేంద్రాలకు తరలించే విధంగా సమర్థవంతమైన రిఫరల్ వ్యవస్థను అమలు చేయాలని సూచించారు.డీఎంహెచ్‌ఓ డా. స్వర్ణ కుమారి మాట్లాడుతూ, జిల్లాలో మాతృ మరణాల నివారణకు ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. ప్రతి మాతృ మరణంపై జిల్లా స్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించి, గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గర్భిణుల క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు, రక్తహీనత నివారణ, సంస్థాగత ప్రసవాల ప్రోత్సాహం, అధిక ప్రమాద గర్భిణుల నిరంతర పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.సమావేశంలో ప్రతి మాతృ మరణానికి సంబంధించిన కేసులను విడివిడిగా సమీక్షించి, వైద్యాధికారులు మరియు సంబంధిత ఆరోగ్య సిబ్బంది నుంచి వివరాలను తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారులు, సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కవ్వాల్‌లోకి మళ్లీ పులుల పునరావాసం: ఎన్‌టీసీఏ పచ్చజెండా!

- **మహారాష్ట్ర నుంచి 5 పులులను కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లోకి తరలించేందుకు నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ ఆమోదం**
- **కేంద్ర ప్రభుత్వ 'విజన్ 2047' రోడ్‌మ్యాప్‌లో భాగంగా కవ్వాల్‌ను కీలకమైన టైగర్ కారిడార్‌గా ఎంపిక చేసిన అధికారులు**
- **పులుల స్వేచ్ఛా సంచారం కోసం ఇప్పటికే కోర్ ఏరియాలోని మైసంపేట్, రాంపూర్ గిరిజన గ్రామాల పునరావాసం పూర్తి**

**మంచిర్యాల, వెలుతురు జూలై 27:**

సుదీర్ఘ నిరీక్షణ తర్వాత తెలంగాణలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్ రూపురేఖలు మారబోతున్నాయి. కవ్వాల్‌లో పులుల సంతతిని పెంచేందుకు మరియు వాటి పునరావాసానికి నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. ఎంతటి చర్యలు చేపట్టినప్పటికీ కవ్వాల్ రిజర్వ్‌లో స్థిరమైన పులులు లేకపోవడంతో, వన్యప్రాణి ప్రేమికులకు, అటవీ శాఖ అధికారులకు ఇది నిజంగా తీపి కబురుగా మారింది.ఎన్‌టీసీఏ, వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా విడుదల చేసిన 'రోడ్‌మ్యాప్ ఫర్ ఎఫెక్టివ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ టైగర్స్ ఇన్ ఇండియా' నివేదిక ప్రకారం.. కవ్వాల్‌లో ప్రస్తుతం శాశ్వత నివాసం ఏర్పరచుకున్న పులులు ఏవీ లేవు. పొరుగున ఉన్న మహారాష్ట్రలోని తడోబా అంధారీ టైగర్ రిజర్వ్, ఇంద్రావతి వన్యప్రాణుల అభయారణ్యం నుంచి మాత్రమే పులులు ఇక్కడికి వలస వస్తున్నాయని నివేదిక స్పష్టం చేసింది. ఈ క్రమంలో కవ్వాల్ ప్రాముఖ్యతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం, దీనిని అత్యంత కీలకమైన టైగర్ కారిడార్ల జాబితాలో చేర్చడమే కాకుండా మొదటి విడతలోనే పులులను పునరావాసం కల్పించేందుకు అనుమతి ఇచ్చింది.మహారాష్ట్ర నుంచి కనీసం ఒక ఆడ పులితో సహా, రెండు సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న ఐదు పులులను కవ్వాల్‌కు తరలించాలని తెలంగాణ అటవీ శాఖ అధికారులు ఎన్‌టీసీఏను కోరారు. రెండు ఏళ్లు పైబడిన పులులు స్వతంత్రంగా సంచరిస్తూ, కొత్త ప్రాంతాలకు త్వరగా అలవాటుపడతాయని, కవ్వాల్‌లో అవి తమ కుటుంబాలను విస్తరిస్తాయని అధికారులు ఆశిస్తున్నారు.పులుల రాకకు అనుగుణంగా అటవీ శాఖ ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. కోర్ జోన్‌లోని మైసంపేట్, రాంపూర్ గ్రామాలకు చెందిన గిరిజన కుటుంబాలను ఇప్పటికే ఇతర ప్రాంతాలకు తరలించారు. అంతేకాకుండా అడవిలో వేటాడటాన్ని నిరోధించడం, ఆక్రమణలను అరికట్టడం మరియు పులులకు తగినంత ఎర (శాకాహార జంతువులు) లభ్యమయ్యేలా వనరులను పెంచే పనులను ముమ్మరం చేశారు.గత 2025లోనే కవ్వాల్‌లోకి పులులను ప్రవేశపెట్టేందుకు 'ప్రాజెక్ట్ టైగర్' పేరిట పంపిన ప్రతిపాదనకు మహారాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. మహారాష్ట్ర చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్




సూత్రప్రాయ ఆమోదం తెలపడంతో, తెలంగాణ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఎలుసింగ్ మేరు ఎన్‌టీసీఏకు అధికారికంగా దరఖాస్తు చేసుకున్నారు. కేంద్రం రూపొందించిన 'విజన్ 2047' రోడ్‌మ్యాప్‌లో భాగంగా రాబోయే రోజుల్లో కవ్వాల్‌లో పులుల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు.



# డెస్క్ జాబ్‌లంటే రిస్కే సుమీ...

మీరు గంటల తరబడి ఒకేచోట కూర్చొని పనిచేస్తున్నారా..? అయిత మీరు అనారోగ్య సమస్యలు కొనితెచ్చుకుంటున్నట్లే.. గంటల తరబడి ఒకేచోట కూర్చొని పనిచేసేవారికి ఊబకాయం, పొట్ట పెరగడం, మధుమేహం, రక్తపోటు, స్థూలకాయం, స్ట్రోక్, క్యాన్సర్, చెడు కొలెస్ట్రాల్, గుండెపోటు, సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా వస్తున్నట్లు డెస్క్ జాబ్ చేసేవారిపై చేసిన అధ్యయనంలో వెల్లడైంది. ప్రస్తుత రోజుల్లో యువత డెస్క్ జాబ్‌లవైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. కానీ ఇవి ఎంత ప్రమాదకరమైనవో ఆలస్యంగా తెలుసుకుంటున్నారు. ఏసీలో గంటల తరబడి కూర్చొని జాబ్ చేయాలని కలలు కంటే పర్వాలేదు.. కానీ దానితో పాటు వ్యాధులను తట్టుకునే శక్తి కూడా ఉండాలని తెలుసుకోండి. డెస్క్ జాబ్‌లో ఉదయం నుంచి మొదలు సాయంత్రం, రాత్రి వరకు ఒకేచోట గంటల తరబడి కూర్చొని పనిచేయాలి. ఇలా కూర్చోవడం అనేది డ్రింకింగ్, స్మోకింగ్ చేసేవారికంటే చాలా ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాజాగా ఓ అధ్యయనంలో డెస్క్ జాబ్‌లు చేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయో తెలిసింది. వాటి గురించి ఈ రోజు తెలుసుకుందాం.

### ప్రమాదకర వ్యాధులు...

డెస్క్ జాబ్‌లు చేసేవారికి దీర్ఘకాలిక వ్యాధులు ఎక్కువగా వస్తున్నట్లు ఈ పరిశోధనలో వెల్లడైంది. ఒకేచోట 8 నుంచి 10 గంటలు కూర్చొని పనిచేసేవారికి జీవక్రియకు సంబంధించిన అనేక వ్యాధులు, టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే అధిక కొలెస్ట్రాల్ పెరిగి విపరీతంగా బరువు పెరుగుతారు.


### పరిష్కార మార్గం...

ఈ ఆరోగ్య సమస్యలు, వ్యాధుల బారిన పడకూడదంటే డెస్క్ జాబ్‌లు చేసేవారు ప్రతి ఒక్కరూ ప్రతి గంటకు ఒక్కసారి లేచి కాస్త రిలాక్స్ కావాలని నిపుణులు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం కాస్త శారీరక శ్రమ ఉండేలా ప్లాన్ చేసుకోవాలంటున్నారు. లేదంటే కొంత సమయం నిల్చుని పనిచేయాలంటున్నారు. ఉదయం, సాయంత్రం వ్యాయామం చేయడం ద్వారా కాళ్లకు రక్తప్రసరణ జరిగి బాడీ నుంచి చెమట బయటకు వెళ్లిపోయి గుండె జబ్బులలాంటివి రాకుండా ఉంటుందని చెబుతున్నారు.

### అకాల మరణం...

గంటల తరబడి ఒకేచోట కూర్చొని పనిచేసేవారికి ఊబకాయం, పొట్ట పెరగడం, మధుమేహం, రక్తపోటు, స్థూలకాయం, స్ట్రోక్, క్యాన్సర్, చెడు కొలెస్ట్రాల్, గుండెపోటు, సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా వస్తున్నట్లు డెస్క్ జాబ్ చేసేవారిపై చేసిన అధ్యయనంలో వెల్లడైంది. అంతేకాదు కొంతమంది కూర్చున్న చోటే చనిపోయే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. మనిషికి కచ్చితంగా శారీరక శ్రమ చేయడం అవసరం. అందుకే డెస్క్ జాబ్‌లు చేసేవారు ప్రతి గంటకు ఒకసారి లేచి వాకింగ్ చేయడం అలవాటు చేసుకోవాలి.





# థైరాయిడ్‌కి ఇలా చెక్ పెట్టండి..!

ప్రస్తుత రోజుల్లో అనేక మంది థైరాయిడ్ వ్యాధితో బాధపడుతున్నారు. వారికి థైరాయిడ్ ఉందన్న విషయాన్ని లేటుగా గుర్తిస్తున్నారు. థైరాయిడ్ సమస్య వచ్చినప్పుడు గొంత దగ్గర వాపు ఏర్పడుతుంది. దీనివల్ల అనేక ఇతర ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. మెడ కింది భాగంలో ఉండే చిన్న సీతాకోక చిలుక గ్రంధిని థైరాయిడ్ గ్రంథి అంటారు. ఇది థైరాక్సిన్, ట్రైఅయోడోథైరోనిన్ అనే రెండు ముఖ్యమైన హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. ఈ హార్మోన్లు శరీరం, పనితీరుకు చాలా అవసరం. ఇది రాకుండా ఉండాలంటే ఎలాంటి ఫుడ్స్ డైట్‌లో ఉండాలో తెలుసుకుందాం.







థైరాయిడ్ గ్రంథి తక్కువ పరిమాణంలో హార్మోన్లను ఉత్పత్తి చేస్తే దాన్ని హైపోథైరాయిడిజం అంటారు. థైరాయిడ్ గ్రంధి అధిక మొత్తంలో హార్మోన్లను ఉత్పత్తి చేస్తే దానిని హైపర్ థైరాయిడిజం అంటారు. ఈ రెండు బ్యాలెన్స్‌డ్‌గా ఉండాలంటే అది మీరు తీసుకున్న ఆహారంపై ఆధారపడి ఉంటుంది. థైరాయిడ్ వచ్చిన తర్వాత ఇబ్బందిపడేకంటే రాకుముందే ముందు జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం. థైరాయిడ్ రాకూడదంటే వివిధ రకాల పండ్లు, కూరగాయలు, గింజలు, తృణధాన్యాలు తినాలి. ప్రోటీన్ కోసం, చేపలు లేదా బీన్స్ వంటి తక్కువ కొవ్వు ఉన్నవాటిని ఎంచుకోవాలి. వంటలో ఆలివ్ ఆయిల్ వంటి ఆరోగ్యకరమైన నూనెలను ఉపయోగించాలి.

చేపలలో ఉండే ఒమేగా3 కొవ్వులు చాలా మేలు చేస్తాయి. ఇది కాకుండా విత్తనాలు, గింజలు, చిక్కుళ్లు తీసుకోవాలి. ఫైబర్ సరైన జీర్ణక్రియను మెయింటెన్ చేయడానికి సాయపడుతుంది. తృణధాన్యాలు, కూరగాయలు, పండ్లు తినడం ద్వారా మీరు తగినంత మొత్తంలో ఫైబర్ పొందవచ్చు. అయోడిన్ మాత్రలు తీసుకోవడం లేదా అయోడిన్ అధికంగా ఉన్న ఆహారాన్ని తినడం మంచిదికాదు. ఇది థైరాయిడ్ హార్మోన్ స్థాయిలను దెబ్బతీస్తుంది. అయినప్పటికీ ఉప్పు పరిమిత పరిమాణంలో తీసుకోవాలి. ఇది శరీరాన్ని బ్యాలెన్స్‌డ్‌గా ఉంచుతుంది.

## మీలో ఈ లక్షణాలుంటే..
# సోషల్ మీడియాకు అడిక్ట్ అయినట్లే...

ఓ సర్వే ప్రకారం సోషల్ మీడియాలో కంటిన్యూగా 3 గంటలు గడిపే టీనేజర్లలో యాంగ్జైటీ, కోపం, నిరాశ వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిసింది. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే మనిషికి కంటినిండా నిద్ర అనేది చాలా అవసరం. ఇది బాడీని రిచార్జ్ చేస్తుంది. హుషారుగా పనిచేసుకోవడానికి సహకరిస్తుంది. సోషల్ మీడియాకి బానిసైపోవడం వల్ల రాత్రిపూట ఎవరూ సరిగ్గా నిద్రపోవడం లేదని సర్వేలో వెల్లడైంది. చాలామంది నిద్రలేమి సమస్యలతో బాధపడుతున్నట్లు బయటపడింది.

ఉదయం లేచిన దగ్గరి నుంచి రాత్రి పడుకునే వరకు వారు సోషల్ మీడియాని అంటిపెట్టుకుని ఒకేచోట గంటలు గంటలు గడిపేవారు ఉన్నారు. ఒకే చోట కూర్చొని లేదా పడుకొని వీడియోలు చూడటం వల్ల విపరీతంగా బరువు పెరిగిపోయి, ఊబకాయం భారినపడే అవకాశాలు ఉన్నాయి. ఇది కాకుండా సోషల్ మీడియా వల్ల యూత్ తమ విలువైన సమయాన్ని కోల్పోతున్నారు. ఏ పని మీద ఏకాగ్రత పెట్టకపోవడం వల్ల కొత్తగా ఏదీ నేర్చుకోలేకపోతున్నారు. కెరియర్ లో మిగతావారితో పోలిస్తే వెనుకబడుతున్నారు. అందుకే సోషల్



రోజులు మారుతున్న కొద్ది స్మార్ట్ ఫోన్ వాడుతున్న వారి సంఖ్య పెరుగుతుంది. తినకుండానైనా ఉండగలుగుతున్నారు కానీ స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా లేకుండా ఉండలేక పోతున్నారు. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ అందులో ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ లాంటి సోషల్ మీడియాలో అకౌంట్ క్రియేట్ చేసుకుని గంటల తరబడి అందులోనే లీనమైపోతున్నారు. సెల్ సౌండ్ అయిందంటే చాలు నా ఫొటోకు లైక్ కొట్టారా, నా వీడియోకి కామెంట్ చేశారా అంటూ తరచుగా ఫోన్ చూస్తూ ఉంటున్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ దీనికి అడిక్ట్ అయి అనేక మంది ఆరోగ్య సమస్యలు

# విద్యార్థులపై లాఠీఛార్జీ సరికాదు: సుప్రీంకోర్టు



- శాంతియుత నిరసన రాజ్యాంగబద్ధ హక్కు: సీజేఐ
- మితిమీరిన బలప్రయోగంపై పోలీసులకు చురకలు
- నిరసనల నిర్వహణకు ఏకరీతి మార్గదర్శకాల అవసరం
- ఆకతాయిలపై కఠిన చర్యలకు అధికారాలు ఉండాలన్న జస్టిస్ బాగ్చి
- సీసీటీవీ, బాడీ కెమెరా ఫుటేజీ భద్రపరచాలని పిటిషనర్ల విజ్ఞప్తి
- విచారణను మంగళవారానికి వాయిదా వేసిన ధర్మాసనం

**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 27,**

ఢిల్లీలో విద్యార్థుల నిరసనల సందర్భంగా పోలీసులు లాఠీఛార్జీ చేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఆందోళనలను కారణంగా చూపుతూ మితిమీరిన బలప్రయోగం చేయడం సమంజసం కాదని పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.జులై 20న జరిగిన విద్యార్థుల ఆందోళనల సమయంలో పోలీసుల చర్యలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా శాంతియుత నిరసనల నిర్వహణ, పోలీసుల వ్యవహార శైలిపై ఏకరీతి మార్గదర్శకాలు రూపొందించాల్సిన అవసరం ఉందని సీజేఐ అభిప్రాయపడ్డారు.మరోవైపు, శాంతియుత నిరసనల్లో ఆకతాయిలు, విద్రోహ శక్తులు చొరబడి హింసకు పాల్పడడం కూడా ఆందోళనకరమేనని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి పేర్కొన్నారు. అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకునేందుకు అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఉండాలని అన్నారు. నిరసనల సమయంలో పోలీసు సిబ్బందిపైనా దాడులు జరిగాయని న్యాయవాది వివరించగా, ప్రతి ఒక్కరి ప్రాణం విలువైనదేనని, హింసకు తావు లేకుండా నిరసనకారులు స్వీయ క్రమశిక్షణ పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా పిటిషనర్లు పోలీసుల చర్యలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని, సీసీటీవీ ఫుటేజీ, బాడీ కెమెరా రికార్డింగ్‌లు వంటి ఎలక్ట్రానిక్ సాక్ష్యాలను భద్రపరచాలని కోర్టును కోరారు. గాయపడిన నిరసనకారులకు నష్టపరిహారం చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కూడా విజ్ఞప్తి చేశారు. పిటిషన్లపై తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

# విద్యార్థులపై ఏకే47తో కాల్పులు..

- కానిస్టేబుల్‌పై సస్పెన్షన్
- బిహార్ బంద్ సందర్భంగా శివాన్‌లో కలకలం
- వైరల్ వీడియోలతో చర్యలకు దిగిన ఉన్నతాధికారులు
- కాల్పుల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు
- 15 ఏళ్ల బాలుడి మెడలో బుల్లెట్.. శస్త్రచికిత్స
- ఘటనపై ప్రతిపక్షాల ఆగ్రహం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 27:**

బిహార్‌లో ఇటీవల నిర్వహించిన 'బిహార్ బంద్' సందర్భంగా శివాన్ జిల్లాలో విద్యార్థుల నిరసనల వేళ ఓ పోలీసు సిబ్బంది ఏకే-47 రైఫిల్‌తో కాల్పులు జరిపిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో స్పందించిన ఉన్నతాధికారులు సంబంధిత కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు.ఈనెల 25న విద్యార్థి సంఘాలు చేపట్టిన 'బిహార్ బంద్' సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నిరసనకారులు, పోలీసుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. శివాన్ జిల్లాలో జరిగిన కాల్పుల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, వారిని పాట్నాలోని జయప్రభ మేదాంత ఆసుపత్రికి తరలించారు.గాయపడిన వారిలో 15 ఏళ్ల మహమ్మద్ ఆరిఫ్ కూడా ఉన్నాడు. బంద్ కారణంగా దుకాణం మూసివేసి ఇంటికి తిరిగి వెళ్తుండగా అతడి మెడలో బుల్లెట్ తగిలినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి బుల్లెట్‌ను తొలగించారని, ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.కాల్పుల ఘటనపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా స్పందిస్తూ.. ఢిల్లీలో నిరసన తెలిపే విద్యార్థులపై పెల్లెట్ గన్‌లు, బిహార్‌లో ఏకే-47లను ప్రయోగిస్తున్నారంటూ బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

# లోక్ సభ ముందుకు యాంటి పేపర్ లీక్ బిల్లు

- పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం..
- రూ.10 కోట్ల జరిమానా దిశగా కేంద్రం
- లోక్‌సభలో ప్రవేశ పరీక్షల చట్ట సవరణ బిల్లు ప్రవేశ పెట్టిన కేంద్రం
- పేపర్ లీక్ దోషులకు మరింత కఠిన శిక్షల ప్రతిపాదన
- పదేళ్ల వరకు జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానాకు అవకాశం
- విపక్షాల ఆందోళనల మధ్య బిల్లును ప్రవేశపెట్టిన జితేంద్ర సింగ్
- సూచనలు స్వీకరించి సవివర చర్చకు హామీ ఇచ్చిన స్పీకర్
- బిల్లుపై విపక్షాల విమర్శలు.. విద్యార్థులపై లాఠీఛార్జీ అంశం ప్రస్తావన




**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 28:**

ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలకు పాల్పడే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టానికి సవరణలు చేసే బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ సవరణలకు ఆమోదం లభించిన నేపథ్యంలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ బిల్లును సభ ముందుకు తీసుకొచ్చారు.విపక్ష సభ్యుల ఆందోళనల మధ్య బిల్లు ప్రవేశపెట్టబడింది. అనంతరం లోక్‌సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. బిల్లుపై సభ్యులు తమ సూచనలను మధ్యాహ్నం ఒంటిగంట వరకు సమర్పించవచ్చని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. సవివర చర్చకు తగిన సమయం కల్పిస్తామని హామీ ఇచ్చిన ఆయన, ఈ బిల్లు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైనదని, దీనిపై చర్చ నుంచి సభ దృష్టి మరలకుండా సహకరించాలని విపక్షాలకు సూచించారు.ప్రస్తుత చట్టం ప్రకారం ప్రశ్నపత్రాల లీకేజీకి సంబంధించిన వ్యక్తిగత కేసుల్లో దోషులకు 3 నుంచి 5 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించే నిబంధన ఉంది. వ్యవస్థీకృత నేరాల్లో పాల్పడిన వారికి 5 నుంచి 10 ఏళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.1 కోటి వరకు జరిమానా విధించవచ్చు. తాజా సవరణలకు పార్లమెంట్ ఆమోదం లభిస్తే, తీవ్రమైన పేపర్ లీక్ కేసుల్లో దోషులకు గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది.మరోవైపు ఈ బిల్లుపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఇది కేవలం పైపై మెరుగేనని ఆరోపించాయి. అలాగే మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుబట్టాయి. జులై 20న 'చలో సంసద్' పేరుతో చేపట్టిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జీ జరిగిన అంశంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాయి. నీట్ సహా పలు ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీల నేపథ్యంలో దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగిన విషయం తెలిసిందే.

# ఇరాన్ నౌకపై ఉక్రెయిన్ దాడి..

- తీవ్ర పరిణామాలుంటాయని టెహ్రాన్ హెచ్చరిక
- కాస్పియన్ సముద్రంలో ఇరాన్ వాణిజ్య నౌకపై దాడి
- ఒక నావికుడు మృతి.. మరొకరికి గాయాలు
- ఉక్రెయిన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిక
- కీవ్‌ను కట్టడి చేయాలని ఐరోపా దేశాలకు ఇరాన్ డిమాండ్
- రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో తమకు సంబంధం లేదన్న టెహ్రాన్
- కీవ్‌పై రష్యా క్షిపణులు, డ్రోన్ల దాడి.. ఆరుగురు మృతి



**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 28:**

కాస్పియన్ సముద్రంలో తమ వాణిజ్య నౌకపై ఉక్రెయిన్ దాడి జరిపిందని ఇరాన్ ఆరోపించింది. ఈ ఘటనలో ఓ నావికుడు మరణించగా, మరొకరు గాయపడినట్లు తెలిపింది. ఈ దాడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన టెహ్రాన్.. తమ దేశ ప్రయోజనాలు, ఆస్తులను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ ఘటనకు కారణమైన ఉక్రెయిన్ తగిన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.యుద్ధం మరింత విస్తరించకుండా చూడాలంటే ఉక్రెయిన్‌ను కట్టడి చేయాలని ఐరోపా దేశాలను ఇరాన్ కోరింది. పశ్చిమాసియాలో ఇప్పటికే ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఈ దాడి చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో తమకు ఎలాంటి పాత్ర లేదని ఇరాన్ మరోసారి స్పష్టం చేసింది.అయితే, రష్యా నుంచి ఇరాన్‌కు ఉపగ్రహ సమాచార సహకారం అందుతోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీ ఆరోపించారు. గల్ఫ్ దేశాలు, అమెరికా సైనిక స్థావరాలకు సంబంధించిన ఉపగ్రహ చిత్రాలను రష్యా సేకరించి ఇరాన్‌కు అందిస్తోందని, వాటిని ఇరాన్ తన సైనిక చర్యల్లో వినియోగిస్తోందని పేర్కొన్నారు.అమెరికా ఆంక్షల నేపథ్యంలో కాస్పియన్ సముద్ర మార్గం ఇరాన్‌కు అత్యంత కీలకంగా మారింది. ఉత్తర దిశలోని ఈ మార్గం ద్వారానే చైనా సహా పలు దేశాల నుంచి వస్తువులు ఇరాన్‌కు చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ వాణిజ్య నౌకపై జరిగిన దాడి వ్యూహాత్మక ప్రాధాన్యం సంతరించుకుంది.మరోవైపు, ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా మరోసారి భారీ దాడికి దిగింది. ఆదివారం తెల్లవారుజామున ఏడు బాలిస్టిక్ క్షిపణులు, 136 డ్రోన్లతో దాడులు జరిపినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం వెల్లడించింది. కీవ్‌తో పాటు చెర్నిహివ్, ఖార్కివ్ తదితర నగరాలు కూడా లక్ష్యంగా మారాయి. ఈ దాడుల్లో ఆరుగురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు.

# తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం..

- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై పవన్ హర్షం
- ఆగస్టు 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అందుబాటు ధరల్లో బియ్యం విక్రయం
- సామాన్యులపై ధరల భారం తగ్గించేందుకే నిర్ణయమన్న పవన్ కల్యాణ్
- నాదెండ్ల మనోహర్ చొరవను అభినందించిన డిప్యూటీ సీఎం
- 130 రైతు బజార్లు, 500 ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయం
- సూపర్ ఫైన్ బియ్యం కిలో రూ.52, గ్రేడ్-1 పచ్చి బియ్యం కిలో రూ.50
- బహిరంగ మార్కెట్ ధరలపై సమీక్ష అనంతరం నిర్ణయం



**అమరావతి, వెలుతురు, జూలై 27:**


ఆంధ్రప్రదేశ్‌లో పెరుగుతున్న బియ్యం ధరలతో సామాన్యులకు ఊరట కల్పించేలా పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఆగస్టు 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని విక్రయించనున్నట్లు ప్రకటించారు. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న ధరల ప్రభావం నుంచి ప్రజలను కాపాడి, అందుబాటు ధరల్లో నాణ్యమైన బియ్యాన్ని అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు.ఈ కార్యక్రమం అమలులో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని పవన్ కల్యాణ్ కొనియాడారు. ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 130 రైతు బజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యాన్ని విక్రయించనున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వ నిర్ణయం ప్రకారం బీపీటీ సూపర్ ఫైన్ బియ్యాన్ని కిలో రూ.52కు, గ్రేడ్-1 పచ్చి బియ్యాన్ని కిలో రూ.50కు విక్రయించనున్నారు. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో పరిస్థితిని అత్యవసరంగా సమీక్షించి, రైస్ మిల్లర్లతో చర్చలు జరిపిన అనంతరం ఈ ధరలను నిర్ణయించినట్లు డిప్యూటీ సీఎం కార్యాలయం వెల్లడించింది.ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరల్లో అందించడంతో కుటుంబాలపై పడుతున్న ఆర్థిక భారం తగ్గుతుందని, మార్కెట్‌లో ధరలను నియంత్రించడంలో కూడా ఈ చర్య దోహదపడుతుందని పవన్ కల్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ అవసరమైన నిర్ణయాలను కొనసాగిస్తుందని తెలిపారు.

# విద్యార్థిని శివాని మృతి కలచివేసింది..పూర్తి దర్యాప్తు చేయాలి: చంద్రబాబు

- పోలవరం జిల్లా విద్యార్థిని ముర్రం శివాని ఆత్మహత్యపై సీఎం ఆవేదన
- మెగా పీటీఎంలో ఉత్సాహంగా మాట్లాడిన విద్యార్థిని మృతి బాధాకరమన్న చంద్రబాబు
- ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని అధికారులకు ఆదేశం
- సమస్యలు వచ్చినా విద్యార్థులు ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపు
- ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా
- శివాని మాటలు పదేపదే గుర్తొస్తున్నాయని మంత్రి లోకేశ్ వ్యాఖ్య

**అమరావతి, వెలుతురు, జూలై 27:**

పోలవరం జిల్లా ఈర్లపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థిని ముర్రం శివాని మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇటీవల రంపచోడవరంలో నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్ మీట్ (పీటీఎం)లో ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడిన విద్యార్థిని ఇక లేరనే విషయం తనను తీవ్ర విషాదంలోకి నెట్టేసిందని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.శివాని వేదికపై తన చదువు, భవిష్యత్ లక్ష్యాల గురించి ఎంతో ఉత్సాహంగా చెప్పిన మాటలు ఇప్పటికీ గుర్తున్నాయని చంద్రబాబు తెలిపారు. ఎంతో మంచి భవిష్యత్ ఉన్న ఓ గిరిజన విద్యార్థిని ఇలా అకాలంగా దూరం కావడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కారణాలు ఏవైనా, తన కలలను నెరవేర్చుకోకముందే ఆమె ప్రాణాలు కోల్పోవడం కలచివేస్తోందన్నారు.శివాని మృతిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించినట్లు సీఎం వెల్లడించారు. అలాగే సమస్యలు, కష్టాలు ఎదురైనా విద్యార్థులు, యువత ఎట్టి పరిస్థితుల్లోనూ నిరాశ, నిస్పృహలకు లోనుకాకూడదని సూచించారు. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుందని, తమ బాధలను కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా ఆత్మీయులతో పంచుకోవాలని కోరారు. ఒత్తిడిని అధిగమించి తమ కలలను సాకారం చేసుకునే దిశగా ముందుకు సాగాలని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఇదే ఘటనపై మంత్రి నారా లోకేశ్ కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రంపచోడవరం మెగా పీటీఎంలో ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడిన శివాని మృతి తీవ్ర విషాదాన్ని నింపిందన్నారు. విషయం తెలిసినప్పటి నుంచి ఆమె మాటలు పదేపదే గుర్తుకొస్తున్నాయని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఎంతటి కష్టమైనా పోరాడాలని, ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవాలని విద్యార్థులకు పిలుపునిస్తూ, "మీకు నేనున్నాను.. ఈ ప్రభుత్వం ఉంది" అని లోకేశ్ తన సందేశంలో పేర్కొన్నారు.



# మీరు మీలా ఉంటే.. చాలు

## రష్మిక



చిత్రసీమలో దక్షిణాది నుంచి ఉత్తరాది వరకూ.. కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ వైవిధ్యమైన పాత్రలతో సినీప్రియుల్ని అలరిస్తోంది అందాల తార రష్మిక. అగ్రతారల సరసన అవకాశాలను అందిపుచ్చుకుంటూనే నాయికా ప్రాధాన్య చిత్రాలను తన ఖాతాలో వేసుకుంటుంది. పాన్ ఇండియా స్థాయిలో కథానాయికగా సత్తా చాటుతున్న ఈ భామ ఇటీవల ఓ కార్యక్రమంలో తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ.. ''ఏ మూస పద్ధతిలోనూ ఇమడకుండా పూర్తిగా కొత్త చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టడం నా జీవితంలోని అద్భుతమైన ప్రయాణం. ఆ సమయంలో నా చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరికీ ఓ ప్రణాళిక ఉండేది. అందుకే నాకు మొదట్లో భయంగా అనిపించింది. కానీ, నేను నా అంతరాత్మ చెప్పిందే అనుసరించేదాన్ని. కెరీర్‌లో ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే అదే నా ప్రయాణాన్ని ప్రత్యేకంగా నిలిపిందని అనిపిస్తుంది. మనల్ని ఇతరుల నుంచి భిన్నంగా చూపే విషయాలే మనకు అతిపెద్ద బలం అని తెలుసుకున్నాను. అందరిలో కలిసిపోవాలనుకుని.. వారితో ప్రతి విషయంలోనూ ఇమిడిపోవాల్సిన అవసరం లేదు. మీరు మీలా ఉంటే చాల''ని చెప్పుకొచ్చింది.

# కింగ్ 100.. సన్నాహాలు



కథానాయకుడు నాగార్జున ప్రస్తుతం తన 100వ సినిమాతో సెట్స్‌పై బిజీగా ఉన్నారు. రా కార్తీక్ దర్శకత్వంలో ముస్తాబవుతున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై ర్మిస్తున్నారు. టబు కీలక పాత్ర పోషిస్తోంది. ఈ చిత్రం ఇప్పటికే ముగింపు దశకు చేరినప్పటికీ ఇంత వరకు దీని నుంచి ఏ అప్‌డేట్ బయటకు రాలేదు. అయితే ఇప్పుడీ సినిమాకి సంబంధించిన తొలి ప్రచార చిత్రాన్ని విడుదల చేసేందుకు చిత్ర వర్గాలు సిద్ధమయ్యాయి. ఆగస్టులో నాగార్జున పుట్టినరోజు సందర్భంగా టైటిల్ టీజర్‌ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాని దసరాకి తెరపైకి తీసుకొచ్చే అవకాశమున్నట్లు గతంలో వార్తలు వినిపించినప్పటికీ.. ఇప్పుడు దీన్ని డిసెంబరు లేదా సంక్రాంతికి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఆగస్టులో విడుదలయ్యే ప్రచార చిత్రంతోనే ఈ విడుదల తేదీపైనా స్పష్టత వచ్చే అవకాశముంది. 'కింగ్ 100' (వర్కింగ్ టైటిల్)తో రూపొందుతున్న ఈ సినిమాలో నాగ్ పలు భిన్న గెటప్పుల్లో అలరించనున్నారు.

# డ్రాగన్ సెట్‌లో ఎన్టీఆర్‌కి ప్రమాదం..

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ప్రమాదానికి గురయ్యాడు. ప్రస్తుతం డ్రాగన్ సినిమాలో ఎన్టీఆర్ బిజీగా ఉన్నాడు. తాజాగా ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా ఆయన భుజానికి తీవ్ర గాయమైంది. గాయం తీవ్రతను పరిశీలించిన వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి ఎన్టీఆర్‌కు కనీసం 6 నుంచి 8 వారాల పాటు ఖచ్చితమైన విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. ఎన్టీఆర్ ఆరోగ్య పరిస్థితిపై అభిమానులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్టీఆర్ టీమ్ స్పష్టం చేస్తూ అధికారిక ప్రకటన రిలీజ్ చేసింది.

'ఈ రోజు సాయంత్రం దురదృష్టవశాత్తు ఎన్టీఆర్ భుజానికి గాయమయ్యిందని అందరికీ తెలియజేయడానికి మేము విచారిస్తున్నాము. పూర్తి వైద్య పరీక్షల అనంతరం, డాక్టర్ జె. మధుసూదన్ రావు, డాక్టర్ ఆర్. ఎ. పూర్ణచంద్ర తేజస్వి నేతృత్వంలోని వైద్యుల బృందం ఆయన పూర్తిగా కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించింది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మేము అందరికీ హామీ ఇవ్వాలనుకుంటున్నాము. ఆయన ఆరోగ్యానికి సంబంధించిన అధికారిక సమాచారాన్ని సమయానుకూలంగా మీతో పంచుకుంటూ ఉంటాము. మీ మద్దతుకు ధన్యవాదాలు' అంటూ ప్రకటనలో రాసుకొచ్చారు. ఈ వార్తతో నందమూరి అభిమానులు ఎన్టీఆర్ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు.



# 'రోహిత్ శర్మకు జోడీగా వైభవ్ సూర్యవంశీని ఓపెనర్‌గా పంపాలి'

టీనేజీ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇటీవల భారత జట్టు తరఫున టీ20ల్లోకి అరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. ఈ 15 ఏళ్ల కుర్రాడిని వన్డేల్లో కూడా ఆడిస్తే బాగుంటుందని భారత మాజీ ఆటగాడు ఫారూక్ ఇంజనీర్ అభిప్రాయపడ్డారు. రోహిత్‌కు జోడీగా వైభవ్‌ను ఓపెనర్‌గా పంపించి శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు రావాలని సూచించారు. దీంతో మిడిల్ ఆర్డర్ బలంగా మారుతుందని ఫారూక్ ఇంజనీర్ అన్నారు.



''గిల్ ఒక క్లాస్ ప్లేయర్. ప్రస్తుతం జట్టులో అతనే అత్యుత్తమ బ్యాటర్ అని నా అభిప్రాయం. అయితే, శుభ్‌మన్ ఆరంభంలోనే దూకుడుగా ఆడే రకం కాదు. వన్డేల్లో ఎడమ, కుడి చేతివాటం కాంబినేషన్ బాగుంటుంది. రోహిత్‌కు జోడీగా లెఫ్ట్ హ్యాండర్ అయిన వైభవ్‌ను పంపాలి. వైభవ్ దూకుడుగా ఆడుతుంటే మరో ఎండ్‌లో రోహిత్ ఎక్కువగా నాన్‌స్ట్రైకింగ్‌లో ఉండటానికి ప్రయత్నిస్తాడు. వైభవ్ ఉన్నంతసేపు రోహిత్ బ్యాట్‌కు పెద్దగా చెప్పాల్సిన అవసరం ఉండదు. కోహ్లీ మూడు, గిల్ నాలుగు స్థానాల్లో రావాలి. అప్పుడు బ్యాటింగ్ లైనప్ పటిష్ఠం అవుతుంది.

సూర్యవంశీని వన్డే జట్టులోకి తీసుకోవడానికి ఇదే సరైన సమయం అనిపిస్తోంది. అతను నిలకడగా పరుగులు సాధిస్తున్నాడు. అతను అద్భుతమైన ఆరంభాన్ని అందించినప్పుడు ఇతర ఆటగాళ్లకు ఇన్నింగ్స్‌ను నిలకడగా ముందుకు తీసుకెళ్లి భారీ స్కోరు సాధించే అవకాశం లభిస్తుంది. నా దృష్టిలో వీవ్ రిచర్డ్స్ గొప్ప బ్యాటర్. అతడిలాంటి బెస్ట్ బ్యాటర్‌ను చూడలేదు. ఇప్పుడు వైభవ్ సూర్యవంశీ కూడా అలానే కనిపిస్తున్నాడు. రానున్న కాలంలో కచ్చితంగా టీమ్‌ఇండియాకు ఆశాకిరణంగా మారనున్నాడు'' అని ఫారూక్ పేర్కొన్నారు.




# కామన్వెల్త్ గేమ్స్.. వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్‌కు మరో పతకం

కామన్వెల్త్ గేమ్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ మరో పతకం సాధించింది. మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 53 కేజీల విభాగంలో జ్ఞానేశ్వరి యాదవ్ రజత పతకం దక్కించుకుంది. స్నాచ్‌లో 88 కేజీలు ఎత్తిన జ్ఞానేశ్వరి.. క్లీన్ అండ్ జెర్క్ 111 కేజీలు మోసి, మొత్తంగా 199 కేజీలతో రెండో స్థానంలో నిలిచింది. ఒనోమే ఒమోలోలా (నైజీరియా) స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఆమె మొత్తం 206 కిలోల (స్నాచ్‌లో 93, క్లీన్ అండ్ జర్క్ 113 కిలోలు) బరువును ఎత్తి కామన్వెల్త్ క్రీడల రికార్డును నెలకొల్పింది. కాగా, రెబెకా గ్రౌల్క్స (కెనడా, 178 కేజీలు) కాంస్య పతకాన్ని దక్కించుకుంది.

ఈ ఫైనల్‌లో జ్ఞానేశ్వరి.. స్నాచ్, క్లీన్ అండ్ జర్క్ రెండింటిలోనూ ఒక్క ప్రయత్నం కూడా విఫలం కాకపోవడం విశేషం. ఛత్తీస్‌గఢ్‌లోని భోండియా గ్రామానికి చెందిన 23 ఏళ్ల జ్ఞానేశ్వరి యాదవ్ రాష్ట్ర పోలీస్ శాఖలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తోంది. ఆమె తండ్రి ఒకప్పుడు బాడీబిల్డర్. కానీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన కలలను వదులుకున్నారు. ఆయన ఇప్పుడు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. జ్ఞానేశ్వరి పతకం సాధించడంతో ఈ కామన్వెల్త్ గేమ్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ పతకాల సంఖ్య నాలుగుకు చేరింది. ఇప్పటికే మహిళల విభాగంలో మీరాబాయి చాను స్వర్ణం గెలవగా.. పురుషుల విభాగంలో రిషికాంత సింగ్, ముత్తుపాండి రాజా రజత పతకాలు సాధించారు. ఓవరాల్‌గా భారత్ ఇప్పటివరకు ఐదు పతకాలు సాధించింది.



# థాంక్యూ వీవీఎస్ సర్.. స్ఫూర్తి నింపారు: శ్రేయస్ అయ్యర్

వరుసగా రెండు సిరీస్‌లను కోల్పోయిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కు భారీ ఊరట లభించింది. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌ను టీమ్‌ఇండియా క్లీన్‌స్వీప్ చేసింది. దీంతో ఎట్టకేలకు సిరీస్ విజయం అందుకొన్నాడు. అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లాండ్ చేతిలో సిరీస్‌లను కోల్పోయిన సంగతి తెలిసిందే. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌తోపాటు సంజు శాంసన్, అక్షర్ పటేల్, అర్షదీప్, హర్షిత్ రాణా అందుబాటులో లేరు. అయినా కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన వీవీఎస్ లక్ష్మణ్ మార్గదర్శకంలో శ్రేయస్ సేన అదరగొట్టింది. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కు అయ్యర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపాడు.

''నిజాయతీగా మాట్లాడుకోవాలంటే.. ఈ సిరీస్‌లో వదిలేసిన క్యాచ్‌లు మినహా, మేం ఎటువంటి లోపాలు లేకుండా ఆడామనేది నా అభిప్రాయం. జట్టులోని ప్రతి ఒక్కరూ.. సహాయక సిబ్బందితో కలిపి అద్భుతంగా శ్రమించారు. ఈ సందర్భంగా వీవీఎస్ సర్‌కు ధన్యవాదాలు. మమ్మల్ని నిరంతరం ప్రోత్సహిస్తూ స్ఫూర్తి నింపారు. మైదానంలోకి దిగిన ప్రతి రోజూ మీరు చెప్పిన మాట సరైందని అనిపించేది. పరిస్థితులకు తగ్గటుగా ఆడామనడంలో ఎలాంటి సందేహం లేదు'' అని శ్రేయస్ తెలిపాడు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com